జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | శుక్రవారం 21 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :218 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

✆ సంప్రదించవలసిన నెంబర్లు

9440231967



## లోకేష్ రాజీనామా చేయాల్సిందే!

- స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత జీవోలు మారుస్తారా?
- ఇందులో మతలబు ఏమిటి
- అందుకే తమ హయాంలో నిర్వహించిన గ్రూప్-1పై తప్పుడు ఆరోపణలు
- డీఎస్సీ అక్రమాలు, గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు సిద్ధమా
- సీఎం చంద్రబాబుకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి సవాల్

**తాడేపల్లి**

"జీవో నంబర్ 4, జీవో నంబర్ 47 ద్వారా గేట్లు ఎత్తారు. పోటీ పరీక్ష అవసరం లేకుండా నియామకాలకు మార్గం తెరిచారు. స్పోర్ట్స్ కోటాలో దాదాపు 372 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. రిక్రూట్‌మెంట్ పూర్తయిన తర్వాత జీవోలు 23, 56 ద్వారా మళ్లీ ఆ గేట్లు మూసేశారు. ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత జీవోలు ఎందుకు వెనక్కి తీసుకున్నారు?" అని మాజీ ముఖ్యమంత్రి- మిగతా3లో

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

- రాష్ట్రాల మధ్య సహకారంతోనే వికసిత్ భారత్ లక్ష్యం
- 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దక్షిణాది రాష్ట్రాలు
- ఏపీ పునర్విభజన చట్టంలో అపరిష్కృత అంశాలపై తక్షణ నిర్ణయం
- 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు



**మహాబలిపురం**

రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరస్పర సహకారం, సమన్వయంతో పరిష్కరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు సాగితే భారతదేశ అభివృద్ధికి మరింత బలమైన చోదకశక్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 2047 నాటికి దక్షిణ భారత్ 10 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందన్నారు. తమిళనాడులోని మహాబలిపురంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. 24 అంశాలతో కూడిన ఎజెండాపై సమావేశంలో చర్చించారు. ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివద్ధి గురించి ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య - మిగతా3లో


## విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు

- వారి పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకే పంపాలి : దీప్కే
- మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే డిమాండ్
- పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే బాధ్యత వహించాలి




## నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చు

- PM CARES నిధిపై ఖర్గే ప్రశ్నలు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని ఖర్గే వెల్లడి
- అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ప్రశ్న




# రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

- ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఎవరికీ ప్రయోజనం ఉండదు
- న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు ఈ సమస్యలను పరిష్కరించలేవు
- సెప్టెంబర్‌లో 4 రాష్ట్రాల సీఎంలతో ఢిల్లీలో భేటీ నిర్వహిస్తాం
- సదరన్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**హైదరాబాద్/చెన్నై /అమరావతి**

దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి దేశ ప్రగతికి మూలాధారమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. జలవివాదాలను న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు పరిష్కరించలేవని.. పరస్పర సంప్రదింపులతోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడం తప్పు కాదని.. అయితే ఆ నెపంతో నీటిని సముద్రంలోకి వదిలేస్తూ ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగిస్తే ఏ ఒక్కరికీ ప్రయోజనం ఉండదన్నారు. అందుకే తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చించడానికి సెప్టెంబర్ తొలి వారంలో ఢిల్లీలో ఆయా రాష్ట్రాల సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని అమిత్ షా ప్రకటించారు. తమిళనాడులోని మహాబలిపురంలో గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ భేటీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు వెళ్లడంతో), తమిళనాడు సీఎం సి.జోసెఫ్ విజయ్, ఏపీ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డి.కె.శివకుమార్,- మిగతా3లో



## మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

- అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు
- ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలు విధించాలని యూఎస్సీఐఆర్ఎఫ్ డిమాండ్
- మోహన్ భగవత్ అమెరికా పర్యటనకు ముందు ప్రతిపాదన
- ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు దౌత్య మర్యాదలు వద్దన్న కమిషన్
- మత స్వేచ్ఛ ఉల్లంఘనలపై ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆరోపణలు
- గతంలోనూ భారత్‌పై యూఎస్సీఐఆర్ఎఫ్ తీవ్ర నివేదిక

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు



మాజీ సీఎం జగన్‌పై మంత్రి నారా లోకేశ్ తీవ్ర విమర్శలు

ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదంటూ ఎద్దేవా

గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ వేయకపోవడానికి ఇదే కారణం

అసెంబ్లీ చర్చ నుంచి జగన్ పారిపోతున్నారని ఆరోపణ

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లోకేశ్ పోస్ట్

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

- ప్రణాళికను పునఃపరిశీలించాలని బోర్డుకు ఆదేశం
- మూడు భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు అభ్యంతరం
- ఈ విధానం అమలుపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ఆదేశం

మూడు భాష విద్యార్థులపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందన్న ధర్మాసనం



# విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు

మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు దయనీయ స్థితిలో ఉన్నాయని, విద్యార్థుల కంటే మంత్రుల కుక్కలకే మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయని ఆయన ఆరోపించారు. గత వారం 'స్కూల్ ఠీక్ కరో' (ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచండి) అనే ప్రచారాన్ని ప్రారంభించిన దీప్కే బృందం, తాజాగా లాతూర్ జిల్లాలోని ఓ పాఠశాలను సందర్శించింది. ఈ క్రమంలోనే మీడియాతో మాట్లాడిన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. పాఠశాలల దుస్థితికి ప్రజాప్రతినిధులు, మంత్రులే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. అనేక పాఠశాలల్లో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, సురక్షితమైన రహదారి సౌకర్యాలు వంటి కనీస వసతులు కూడా లేవని విమర్శించారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల పట్ల జంతువుల కంటే హీనంగా ప్రవర్తిస్తున్నారని ఆయన ఆరోపించారు.

"ఇది విద్యార్థుల జీవితాలకు సంబంధించిన విషయం. రాజకీయ నాయకులు విద్యార్థుల కోసం ఏమీ చేయనప్పుడు, ప్రజలు వారికి ఎందుకు ఓటు వేయాలి? కేవలం హెలికాప్టర్లలో తిరగడానికే ప్రజలు వారికి ఓట్లు వేస్తారా? తమ పిల్లలు ఎలాంటి పరిస్థితుల్లో చదువుకుంటున్నారో ప్రజలు గమనించాలి. ఈ మంత్రుల కుక్కలకు కూడా దీనికంటే మెరుగైన సౌకర్యాలు ఉంటాయి. ఏ రాజకీయ పార్టీకి చెందినవారైనా సరే, తమ గ్రామానికి వచ్చే నాయకులతో విద్య కోసం కృషి చేయాలని ప్రజలు డిమాండ్ చేయాలి. విద్య కోసం పని చేసేంత వరకు ఓట్ల కోసం మా ఇంటి గుమ్మం వద్దకు రావద్దని వారికి తేల్చి చెప్పండి. రాజకీయాల కోసం మనం కుల, మతాల జెండాలు పట్టుకుని




ఇళ్ల నుంచి బయటకు వస్తాం. అదే విధంగా, మన పిల్లల పాఠశాలల కోసం కూడా మనం బయటకు రావాలి. వీరు ఎప్పుడూ మతం ప్రమాదంలో ఉందని చెబుతుంటారు. ఇన్ని ఏళ్లలో అంతం కాని మతం, మీ హయాంలోనే అంతమైపోతుందా? మతం ఎక్కడికీ పోదు, కానీ పిల్లల భవిష్యత్తు మాత్రం దెబ్బతినవచ్చు."

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని దీప్కే కోరారు. అనేక ఏళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడంలో సర్కార్? విఫలమైందని దీప్కే ఆరోపించారు. "పాఠశాలల పరిస్థితి చూస్తుంటే విద్యాశాఖ మంత్రి ఆ పదవిలో కొనసాగకూడదని నాకు అనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచాల్సిన ఆవసరాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలంటే, మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లోనే చదివించాలి. వర్షం కారే రేకుల పైకప్పులు, సరిపడా బెంచీలు లేని పాఠశాలల్లో విద్యార్థులు ఇంకా చదువుకుంటున్నారు. పదేళ్లలోనూ ఈ కనీస సమస్యలను పరిష్కరించలేకపోతే, ప్రభుత్వం ఏం సాధించిందో వివరించాలి." అని ఆయన అన్నారు.

జబీూ బృందం ఇంతకుముందు తనిఖీ చేసిన పాఠశాలలో అపరిశుభ్రమైన పరిస్థితులపై కూడా దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు. ఆవరణలో పేరుకుపోయిన పనికిరాని వస్తువులు, చెత్తతో పాములు రావడానికి అనుకూలమైన పరిస్థితులను సృష్టించాయని ఆరోపించారు. పాఠశాలల్లో పాముకాటు వల్ల పిల్లలు మరణించినట్లు వస్తున్న వార్తలను ప్రస్తావిస్తూ, సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఇలాంటి ఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు. జబీూ తనిఖీల కారణంగా అధికారులు పాఠశాలల్లో కొన్ని పనులు చేపట్టడం ప్రారంభించారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో చీజుజు పేపర్ లీక్ కేసుపై జరుగుతున్న జదీ× దర్యాప్తు గురించి దీప్కే స్పందించారు. ఈ దర్యాప్తు కేవలం కింది స్థాయి నిందితులపైనే దృష్టి సారిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అదే సమయంలో పెద్ద వ్యక్తులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. "వ్యవస్థలోని ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఇలాంటి ఘటన జరిగిందని నమ్మడం కష్టం. కేవలం కొందరు కింది స్థాయి వ్యక్తులను అరెస్టు చేసి చర్యలు తీసుకున్నామని చెప్పుకోవడం సరిపోదు." అని ఆయన అన్నారు. జెన్? జీ ఆందోళనలను ప్రస్తావిస్తూ 2029 ఎన్నికల నాటికి యువత ఒక బలమైన ఓటర్ల శక్తిగా మారుతారని, రాజకీయ పార్టీలు వారి సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు.

# దసరాలో లోకల్ సందడి




**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫోటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోంది.ఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది.కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి అధికారిక టెస్ట్ లాంటివి . సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన భారీ విజయం తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల వేవ్ ఉండటం సహజం. మరోవైపు, పరాజయం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ స్థానిక సమరం ఊపిరి పీల్చుకునే అత్యంత కీలకమైన వేదిక. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న వైసీపీ, స్థానిక సంస్థల ద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో మళ్లీ ఉత్సాహం నింపాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల బలంతో పాటు,వైసీపీ శ్రేణులు కనీసం వార్డు, పంచాయతీ స్థాయిలో పట్టు నిలుపుకోగలిగితే పార్టీకి కొత్త పునాది లభిస్తుంది. అందువల్లే, ప్రభుత్వం ఎంత వేగంగా ఎన్నికలకు వెళ్లినా వైసీపీ కూడా వెనకడుగు వేయకుండా పోరుకు సిద్ధమవుతోంది.ఎన్నికల వ్యూహాల పరంగా చూస్తే.. స్థానిక పోరులో పార్టీ గుర్తుపై జరిగే మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోల్స్ ఒకెత్తయితే, పార్టీ గుర్తులేని ఎన్నికలు మరొకెత్తు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఉండే పాత కక్షలు, వర్గపోరు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకమైన రాజకీయ సమీకరణాల్లో అధికార కూటమి మధ్య సీట్ల సర్దుబాటు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ పరీక్షగా మారే ప్రమాదం కూడా ఉంది. దీన్ని వైకాపా తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పూర్తి రాజకీయ వేడిని నింపబోతున్నాయి. పొలిటికల్ అట్మాస్పియర్ అంతా గ్రామ సర్పంచ్ నుండి మున్సిపల్ ఛైర్మన్ దాకా ఆశావాహుల హడావుడితో మారబోతోంది. ఒకవైపు ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని దిగువ స్థాయి దాకా విస్తరించాలని భావిస్తుంటే, మరోవైపు ఉనికి చాటుకోవడానికి వైసీపీ పోరాడుతోంది. కాబట్టి రాబోయే రెండు నెలలు ఏపీ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల చుట్టూ తిరిగే ఓట్ల పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం

# నిన్న నల్గొండ... ఇవాళ వరంగల్... కాంగ్రెస్‌లో కల్లోలం



**హైదరాబాద్ :** లంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమయ్యాయి. అధికార కాంగ్రెస్‌లో అంతర్గత ముసలం రోజు రోజుకూ ముదురుతోంది. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత ప్రభుత్వంపైనే విమర్శలు చేస్తున్నారు. మొన్నటి వరకు మంత్రి పదవి కోసం ప్రయత్నించారు. విఫలం కావడంతో తిరుగుబాట పట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా పరకాల జరిగిన బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డినే వచ్చే ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయించాలని, ఆయనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు. ఇవి తన మంత్రివర్గ సహచరురాలు కొండా సురేఖకు షాక్ ఇచ్చాయి. పరకాల సీటు తన కూతురుకు ఇప్పించాలని మంత్రి కొంటున్న కలలు కల్లలయ్యాయి.ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖను, ఇతర ఎమ్మెల్యేలకు మధ్య సఖ్యత కొరవడింది. కొండాపై ఇటీవలే ఉమ్మడి జిల్లా నేతలు సీఎంకు, పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు చేశారు. కొండా మురళి అరాచకాలనూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పరకాల సభలో రేవంత్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కృషిని ప్రశంసించారు. ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన పనులను గుర్తు చేస్తూ, వచ్చే ఎన్నికల్లో కూడా ఆయననే గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఇది సాధారణ ప్రోత్సాహం కాకుండా, స్పష్టమైన రాజకీయ సంకేతం. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, సీఎం స్థాయిలో ఇలా పేరు తీసుకుని మాట్లాడటం అరుదు. దీంతో పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అధికార పార్టీలో బలమైన మద్దతు ఉన్నట్లు స్పష్టమైంది.మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి గత కొన్ని నెలలుగా తమ కుమార్తె సుష్మితను పరకాల నుంచి బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. కుటుంబం పరకాలను తమ రాజకీయ కంచుకోటగా భావిస్తూ, సుష్మితను తదుపరి తరం నాయకురాలిగా నిలబెట్టాలని చూస్తున్నారు. గతంలో కూడా సురేఖ పరకాల నుంచి పోటీ చేసిన నేపథ్యం ఉంది. కానీ సీఎం నేరుగా ప్రస్తుత ఎమ్మెల్యే పేరు చెప్పి మద్దతు తెలపడంతో కొండా కుటుంబం ఆశలు ఆవిరయ్యాయి. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, సీఎం ఉమ్మడి వరంగల్ పర్యటనలో కొండా సురేఖ?మురళి దంపతులు హాజరు కాలేదు. మేడారం నుంచి పరకాల వరకు జరిగిన కార్యక్రమాల్లో వారు కనిపించకపోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత సమతుల్యతను సూచిస్తోంది. సీఎం స్థానిక ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇస్తూ, కుటుంబ రాజకీయాలకు దూరంగా ఉండాలనే సందేశం ఇచ్చినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి బలమైన స్థానిక నాయకుడిగా ఉన్నారు. ఆయనను కొనసాగించడం ద్వారా పార్టీలో స్థిరత్వం కాపాడుకోవాలని సీఎం భావించి ఉండవచ్చు. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. టికెట్ పంపిణీ అధికారికంగా జరగాల్సి ఉంది. కొండా కుటుంబం ఇప్పుడు ఎలా స్పందిస్తుందో, సుష్మిత ఏమి చేస్తారో చూడాలి. పార్టీలోని ఇతర నాయకులు కూడా ఈ సంకేతాన్ని గమనిస్తూ ఉంటారు.మొత్తంగా చూస్తే పరకాల సభ ద్వారా కొండా కుటుంబం పెద్ద అంద కోల్పోయినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సురేఖ పనితీరుపై సీఎం అసంతృప్తిగా ఉన్నారు. ఆమెకే వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తారా లేదా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు ఆమెతోపాటు ఆమె కుటుంబానికి షాక్ ఇచ్చారు. సీఎం స్పష్టమైన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

## మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు..



ఆర్ఎస్ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యూఎస్సీఐఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తో పాటు ఆర్ఎస్ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నత స్థాయి దౌత్య మర్యాదలు ఇవ్వొద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యూఎస్సీఐఆర్ఎఫ్ ఛైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఆర్ఎస్ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్ఎస్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యూఎస్సీఐఆర్ఎఫ్.. ఆర్ఎస్ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది. అయితే యూఎస్సీఐఆర్ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై పక్షపాతంతో కూడిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అనుమానాస్పద వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యూఎస్సీఐఆర్ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అమెరికాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారతీయులపై పెరుగుతున్న అసహనాన్ని ముందుగా పరిశీలించాలని సూచించారు.

## 'విరాళాల దోపిడీకి రామమందిర ట్రస్ట్ సరిపోలేదా?'




అయోధ్య రామమందిర విరాళాల చోరీ, పీఎం కేర్స్ నిధి వినియోగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నలు లేవనెత్తారు. ౯వీ జాా=జుూ నిధి, రామమందిర ట్రస్ట్ రెండూ ప్రధాని మోదీ పర్యవేక్షణలోనే ప్రకటించాయని, రెండింటికీ విరాళాలు అందుతాయని ఆయన తెలిపారు. పీఎం కేర్స్ ట్రస్ట్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేశారు. ఆ ఏడాదిలో కేవలం రూ. 87.85 లక్షలు మాత్రమే ఖర్చు కాగా, నిధిలో సుమారు రూ. 8,452 కోట్ల మిగులు నిల్వ ఉందని ఆయన పేర్కొన్నారు. 2024-25లో జరిగిన ఖర్చు నిధి మిగులు నిల్వలో కేవలం 0.01 శాతం మాత్రమేనని ఖర్గే ఎక్స్? వేదికగా ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల కోసం ఏర్పాటు చేసిన నిధిలో వేల కోట్ల రూపాయలు ఎందుకు మూలుగుతున్నాయని ఆయన ప్రశ్నించారు.

ప్రజా జవాబుదారీతనం లేని ప్రభుత్వ వ్యవస్థనా? విరాళాల దోపిడీకి ఒక రామమందిర ట్రస్ట్ సరిపోలేదా అన్నట్లుగా ఉంది! గుర్తుంచుకోండి మోదీ, మీరే౯వీ జాా=జుూ నిధిని, రామమందిర ట్రస్ట్‌ను ప్రకటించారు. మీ పర్యవేక్షణలోనే రెండింటికీ విరాళాలు అందుతున్నాయి!" అని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి ౯వీ జాా=జుూ నిధిలో రూ. 8,452 కోట్ల నిల్వ ఉందని ఖర్గే వెల్లడించారు. ఈ క్రమంలోనే నిధికి సంబంధించిన జవాబుదారీ విధానాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఇది =౫ (సమాచార హక్కు చట్టం) పరిధిలోకి రాదని, జాా+ ఆడిట్ లేదా పార్లమెంటరీ జవాబుదారీతనానికి లోబడి లేదని ఆయన ఆరోపించారు. 2024-25లో నిధి నిల్వలో చాలా తక్కువ భాగం మాత్రమే ఖర్చయినప్పటికీ, అత్యవసర నిధిలో వేల కోట్లు ఎందుకు పోగుచేస్తున్నారని, దాని వెనక ఉన్న కారణం ఏంటని ఖర్గే ప్రశ్నించారు.

**నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చు : ఖర్గే**

"ప్రధానమంత్రి ఈ ట్రస్టుకు ఛైర్మన్‌గా ఉన్నారు. రక్షణ, హోం, ఆర్థిక శాఖ మంత్రులు దీనికి ట్రస్టీలుగా ఉన్నారు. ఇది జా= (కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు, పన్ను మినహాయింపు పొందే విరాళాలను స్వీకరిస్తుంది. ప్రధానమంత్రి పేరుతో ఉన్న ఈ నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాల పరిధిలోకి ఎందుకు రాకుండా ఉందో వివరించాలి. ప్రధానమంత్రి పేరుతో ఉన్న నిధి సాధారణ ప్రజా పరిశీలన విధానాలకు ఎందుకు అతీతంగా ఉంది? 2024-25 ఆర్థిక సంవత్సరంలో అందుబాటులో ఉన్న నిధుల్లో కేవలం 0.01% మాత్రమే ఖర్చయినప్పుడు, వేల కోట్ల రూపాయల అత్యవసర నిధిని పోగుచేయడంలో ఉన్న ఉద్దేశం ఏంటి?" అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు పొదుపు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చిన వడ్డీతో పాటు, స్వదేశీ, విదేశీ విరాళాలు కూడా ఈ నిధికి సమకూరాయని ఖర్గే వెల్లడించారు.

**పీఎం కేర్స్ ఫండ్ ఏంటి?**

కొవిడ్-19 మహమ్మారి వంటి అత్యవసర, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడానికి, అలాగే బాధితులకు ఉపశమనం కల్పించడానికి ఒక ప్రత్యేక ప్రజా స్వచ్ఛంద ట్రస్ట్‌గా 'ప్రధానమంత్రి సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిట్యుయేషన్స్ ఫండ్' (౯వీ జాా=జుూ ఫీబఅ) ఏర్పాటు చేశారు. 2020 మార్చి 27న ఢిల్లీలో 'రిజిస్ట్రేషన్ చట్టం-1908' కింద అధికారికంగా ఈ ట్రస్ట్ నమోదైంది. జాతీయ సంక్షోభ సమయాల్లో విరాళాలను స్వీకరించడానికి, సహాయాన్ని అందించడానికి ఒక కేంద్రీకృత వ్యవస్థగా ఇది పనిచేస్తుంది.

## సీబీఎస్ఈ 3 భాషల విధానం అమలుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (చీజా 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది.

**ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు లేవనెత్తిన ప్రధానాంశాలు:**

ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

# దక్షిణాది ప్రగతికి సమష్టి అడుగులు

-మొదటిపేజీ తరువాయి

పరస్పర సహకారం సాధించటమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కుప్పం మీదుగా బుల్లెట్ రైలు కారిడార్‌ను అభివద్ధి చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. అమరావతి--బెంగళూరు--చెన్నై నగరాలను అనుసంధానించే ఈ మార్గం మూడు రాష్ట్రాల మధ్య ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం ఇస్తుందని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టుల ఏర్పాటు, దక్షిణ గ్రిడ్‌ను జాతీయ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం, యూనివర్సిటీలు, ఇతర స్కిల్లింగ్ సంస్థలతో కలిసి సంయుక్త నైపుణ్యాభివద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రకతి విపత్తుల సమయంలో ఏ రాష్ట్రం ఒంటరిగా ఉండకుండా పరస్పర సహాయానికి ప్రత్యేక విపత్తు నిర్వహణ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేయాలని కేంద్రానికి ప్రతిపాదించారు. దక్షిణాది ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఉత్తర భారతదేశంలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో అనుసంధానిస్తూ ప్రత్యేక వారసత్వ, పర్యాటక, తీర్థ యాత్ర సర్క్యూట్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. తిరుపతి, శ్రీశైలం, కాంచీపురం, మధురై, రామేశ్వరం, మైసూరు వంటి ప్రాంతాలను వారణాసి, అయోధ్య, చార్ ధామ్ ప్రాంతాలతో అనుసంధానించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రోత్సాహం కల్పించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి ప్రతిపాదన చేశారు. దేశ స్థూల ఉత్పత్తిలో దక్షిణాది ఐదు రాష్ట్రాల వాటా ప్రస్తుతం 31 శాతంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. 2047 నాటికి భారత్ 30--35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి దక్షిణాది రాష్ట్రాలు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలిపారు. ఏపీ 2.4 ట్రిలియన్ డాలర్లు తమిళనాడు 2.6, కర్ణాటక 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థలుగా లక్ష్యాలు నిర్దేశించుకున్నాయని సమష్టిగా దక్షిణ భారత్ లోని రాష్ట్రాలన్నీ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని ముఖ్యమంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను చంద్రబాబు సమావేశం దష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు




గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తికాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు, సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ అభివద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఏపీ భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సీఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్--13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. విశాఖ--చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బీపీసీఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్ కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సీఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.


# రాష్ట్రాల జల వివాదాలకు చర్చలే శరణ్యం

-మొదటిపేజీ తరువాయి

కేరళ వి.డి.సతీశన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కృష్ణా జలాల వాడకానికి అనుమతించాలి: కర్ణాటక సీఎం**

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 2013లో కృష్ణా జలాల పంపిణీపై తీర్పును ప్రకటించగా, ఇంకా ఆ తీర్పును నోటిఫై చేయలేదని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. 10 నిమిషాల్లో జరగాల్సిన పని 13 ఏళ్లు గడిచినా పరిష్కారం కాలేదని, ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేయకపోయినా..ఆ తీర్పులో జరిపిన కేటాయింపుల ఆధారంగా కృష్ణా జలాలను వాడుకోవడానికి అనుమతించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నీటి కేటాయింపులు లేకుండా తెలంగాణ నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన కోరగా చర్చలతో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని అమిత్‌షా సూచించారు.



**పోలవరం నుంచే గోదావరి--కావేరి అనుసంధానం**

పోలవరం ప్రాజెక్టు నుంచే గోదావరి--కావేరి అనుసంధానం చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబు కోరారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు వివాదాన్ని పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షా సూచించగా అన్ని ప్రాజెక్టులపై చర్చించి ఏకాభిప్రాయానికి వద్దామని చంద్రబాబు సూచించారు. పాలమూరు--రంగారెడ్డి, తుమ్మిడిహెట్టి, గోదావరి--కావేరి అనుసంధానం ప్రాజెక్టులతోపాటు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును నోటిఫై చేసే అంశంపై సెప్టెంబర్‌లో ఢిల్లీలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సీఎంలతో సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా అమిత్ షా ప్రకటించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

**ఏపీ--తెలంగాణ విభజన అంశాలపై..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తులు, అప్పుల విభజన, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర హోంశాఖ సంప్రదింపులతో త్వరలోనే పరిష్కరించుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులు సమ్మతించారు.

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

**విజయవాడ :** ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది.కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు ాఇఅ నోటిఫికేషన్ జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.

**1986 తర్వాత డైరెక్ట్ఎలక్షన్స్**

ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు.నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.



## లోకేష్ రాజీనామా చేయాల్సిందే!

-మొదటిపేజీ తరువాయి

వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ప్రశ్నిస్తే కూటమి ప్రభుత్వం గింజుకుంటోందే తప్ప.. తప్పును ఒప్పుకునే పరిస్థితిలో లేదని వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. డీఎస్సీ అక్రమాలపై వైయస్‌ఆర్‌సీపీ పోరాటం చేస్తుండటంతోనే తమ హయాంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్--1 నియామకాలపై కూటమి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ, గ్రూప్--1 వ్యవహారాల్లో వాస్తవాలు, అధికారిక రికార్డులు, కోర్టు ఆదేశాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన వైయస్‌ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఈ అంశాలపై ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. జగన్ మోహన్ రెడ్డి ఏమన్నారంటే.. ఈరోజు ప్రధానంగా డీఎస్సీ అంశంపై మాట్లాడుతున్నాను. ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీలో సుదీర్ఘమైన అబద్ధాలతో కూడిన ప్రసంగాలు చేశారు. వాటికి సమగ్రంగా సాక్ష్యాలు, ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.' "పరీక్ష ప్రశ్నల తయారీకి ఒక వ్యక్తినే పెట్టారు. పరీక్ష నిర్వహణ కార్యక్రమాన్ని కూడా అదే వ్యక్తికి అప్పగించారు. ఏపీ డీఎస్సీ నియామకాల చరిత్రలో, ఏపీ పీఎస్సీ నియామకాల చరిత్రలో ఈ రెండు బాధ్యతలను ఒకే వ్యక్తికి అప్పగించిన సందర్భం ఇంతవరకు లేదు. ఇలా చేయడం లీకేజీకి స్వయంగా ద్వారాలు తెరిచినట్టే." "డిజిటల్ మూల్యాంకనాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు పక్కన పెట్టారు. మాన్యువల్ మూల్యాంకనం చేశారు. ఆ మార్కుల ఆధారంగానే ఇంటర్వ్యూలు నిర్వహించి రిక్రూట్‌మెంట్ పూర్తి చేశారు. 165 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. నాలుగేళ్లుగా వాళ్లు ఉద్యోగాలు చేస్తున్నారు. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత మళ్లీ వాళ్లపై విషప్రచారం చేస్తున్నారు." "టీవీ ఫుటేజీలు ఉన్నాయి. కేంద్ర ఫోరెన్సిక్ ప్రయోగశాల నివేదికలు ఉన్నాయి. సిట్ నివేదిక ఉంది. ఎగ్జామినర్లను విచారించారు. వారితో చేతిరాత పరీక్షలు కూడా నిర్వహించారు. ఓఎంఆర్ మూల్యాంకన స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు లేవు. జవాబు పత్రాల్లో కూడా మార్పులు జరగలేదు. అలాంటప్పుడు డీఎస్సీపై ఇంకా ఈ ప్రచారం ఎందుకు?"

"మరింత దిగజారి 2018లో ఏపీపీఎస్సీ గ్రూప్--1 భర్తీపై తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. 163 మంది ఉన్నత ఉద్యోగుల జీవితాలను అతలాకుతలం చేయాలని చంద్రబాబు నాయుడు టార్గెట్‌గా పెట్టుకుని వ్యవహరిస్తున్నారు. దీనికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందు పెట్టాల్సిన అవసరం ఉంది."

"2019 ఎన్నికలకు కేవలం 76 రోజుల ముందు గ్రూప్--1 నోటిఫికేషన్ ఇచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. ఆ నోటిఫికేషన్ మేము ఇచ్చింది కాదు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ అది." "2019 మే 26న గ్రూప్--1 ప్రిలిమ్స్ పరీక్ష పూర్తయింది. మే 30న మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అంటే మా ప్రభుత్వం రాకముందే ప్రిలిమ్స్ నిర్వహించారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించాం. 2020 డిసెంబర్ 14 నుంచి 20 మధ్య మెయిన్స్ పరీక్ష నిర్వహించాం. ప్రిలిమ్స్‌లో పాస్ అయిన వారికి మెయిన్స్ నిర్వహించడమే మా ప్రభుత్వం చేసింది." "ఫైనల్ ఫలితాల వెల్లడిలో ఏ తప్పూ జరగలేదని చంద్రబాబు ప్రభుత్వమే హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. 2025 నవంబర్ 14న ఆయన ప్రభుత్వంలోని అధికారులు కోర్టుకు అఫిడవిట్ ఇచ్చారు. మరి ఇప్పుడు అదే ప్రభుత్వం మరో రకమైన ప్రచారం ఎందుకు చేస్తోంది?"

"2025 ఏప్రిల్‌లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తూనే ఒక సిట్ వేశారు. కోర్టులో కేసు జరుగుతుండగానే, చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఫిడవిట్లు పడటం మొదలయ్యాయి. ఆ తర్వాత 2026 ఫిబ్రవరి 14న మరో సిట్ వేశారు. మొదటి సిట్‌పై నమ్మకం లేక రెండో సిట్ ఎందుకు? సిట్‌లో ఉండేది ఎవరు? చంద్రబాబు నాయుడు కింద పనిచేసేవారు కాదా?" " హ్యాయ్‌లాండ్‌లో ఏదో జరిగిపోయిందని పదేపదే ప్రచారం చేస్తున్నారు. కానీ హైలాండ్‌లో జరిగిన ప్రక్రియకు ఫైనల్ మూల్యాంకనం, ఎంపిక ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని అధికారిక పత్రాలు చాలా స్పష్టంగా చెబుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వమే 2025 నవంబర్ 11న హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌ను కూడా చూడాలి." "అరెస్ట్ చేసినట్టుగా, జైలులో పెట్టినట్టుగా, మెజిస్ట్రేట్ ముందు పెట్టినట్టుగా, జడ్జి శిక్ష వేసినట్టుగా అసెంబ్లీలో మాట్లాడుతున్నారు. కానీ వాస్తవం ఏమిటి? తేదీ చూపించండి. 25/08/2025న స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. అరెస్ట్ కాదు. మరి అరెస్ట్ చేసినట్టుగా ఈ ప్రచారం ఎందుకు?" "కేంద్ర ప్రభుత్వం 2009 నుంచి ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన వ్యక్తి వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి ట్రాక్ చేయాలి. అక్కడే 'యెట్ టు బీ అరెస్టెడ్' అనే స్థితి చూపిస్తున్నారు. మరి అరెస్ట్ చేసినట్టుగా అసెంబ్లీలో ఎలా మాట్లాడుతున్నారు? రికార్డుల్లో ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు పెట్టాలి." "డీఎస్సీ అంశంపై చర్చ జరగాలి. లోకేష్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని చెప్పడానికి వాళ్ల దగ్గర సాక్ష్యాలు, ఆధారాలు ఉంటే సభలో పెట్టాలి. సీబీఐ విచారణ అవసరం లేదని చెప్పడానికి కూడా ఆధారాలతో సిద్ధంగా ఉంటే కౌన్సిల్‌లో చర్చకు రావాలి. కానీ చర్చకు మాత్రం రారు. చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారు." "డీఎస్సీ అంశంపై తప్పులు జరిగాయని స్పష్టంగా కనిపిస్తున్నాయి. చర్చకు రారు. సీబీఐ విచారణకు ఆదేశించరు. అలాంటి పరిస్థితుల్లో లోకేష్ రాజీనామా చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ తేటతెల్లంగా కనిపిస్తోంది." జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియదు

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌కు ఏపీపీఎస్సీ, డీఎస్సీల మధ్య గల వ్యత్యాసం కూడా తెలియదని, ఆ అజ్ఞానం వల్లే గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ మేరకు జగన్ పాత ప్రెస్ మీట్ వీడియోను లోకేశ్ గురువారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "ఏపీపీఎస్సీ అంటే ఏమిటో తెలియదు, డీఎస్సీ అంటే ఏమిటో తెలియదు. రెండూ ఒకటే అని జగన్ భావిస్తున్నారు" అంటూ లోకేశ్ తన పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నియామక వ్యవస్థలపై జగన్‌కు ఉన్న అవగాహన లోపం వల్లే గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీని కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో జరిగే చర్చ నుంచి కూడా జగన్ పారిపోతున్నారని ఆక్షేపించారు.

ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్), డీఎస్సీ (జిల్లా ఎంపిక కమిటీ)... ఈ రెండు వేర్వేరు వ్యవస్థలనే కనీస పరిజ్ఞానం కూడా జగన్‌కు లేదని లోకేశ్ విమర్శించారు.

## బొత్స అనూష పొలిటికల్ ఎంట్రీ...

**విజయనగర్ :** మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుపున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు.2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

# జి. కొత్తపల్లి పి.హెచ్.సి వైద్య సిబ్బంది డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణ లో "ప్రపంచ దోమల దినోత్సవం "

**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఆగస్టు 20:** గోకవరం మండలం జి. కొత్తపల్లి పి.హెచ్.సి వైద్య సిబ్బంది డా. తిరన్, డా. నిఖిత పర్యవేక్షణ లో "ప్రపంచ దోమల దినోత్సవం "సందర్భంగా ప్రిన్సిపాల్ కె. ఎస్. సుధాకర్ రెడ్డి సమక్షంలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం మరియు అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు . "మనమందరం కలసి ముందుకు అడుగు వేస్తే దోమలను నిర్మూలించగలం,వ్యాధులను నియంత్రించగలం,ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలం అనే ఈ సంవత్సరం నినాదం తో ముందుకు వెళ్లాలని సర్. రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త మలేరియా అనేది ఆడ అనాఫిలిస్ దోమవలన సోకుతుందనే విషయాన్ని 1897ఆగస్టు 20న ప్రపంచానికి తన పరిశోధన ద్వారా తెలియపరచుట వలన ఆగస్టు 20వ తేదీ ని అంతర్జాతీయ దోమల నివారణా దినోత్సవం గా జరుపుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్. పి. హెచ్. ఏ. పవన్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం గురించి



అవగాహన కలిగి సమాజానికి దోమల నిర్మూలనలో తమవశీతు కృషి చేయాలని డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్య వంటి కీటక జనిత వ్యాధులు నిర్మూలనలో మంచి పాత్ర పోషించాలని సమిష్టి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో కళాశాల లెక్చరర్స్ చైతన్య, జి. శ్రీనివాస్ వైద్య సిబ్బంది మోనిక అరుణ, విశ్వనాథం, ప్రభావతి, వెంకటలక్ష్మి, పవన్, రమణ, ఎమ్. శ్రీనివాస్, అప్పారావు, ఆశాలు నాగలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

## అణగారినవర్గాలపక్షపాతి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు!..

**తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వి.ఆర్.పురం,ఆగస్టు20(ప్రజాజ్యోతి ప్రతినిధి)**అణగారిన వర్గాల పక్షపాతి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,మరోమారునిరూపించుకున్నార ని,తెలుగుదేశంపార్టీఅధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్,స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళ్తే,బి.సి,మహిళ దళవాయి రమాదేవి, ఎమ్మెల్సీగా, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వర్ల రామయ్య, ఎమ్మెల్సీపదవి తెలుగుదేశంపార్టీ ఇవ్వడంపై ఆయన సంతోషంవ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ, అంటేనేబి. సి,లపార్టీని, ముఖ్యమంత్రి, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, బి.సి,ల పై ఉన్న మమకారం, బడుగుబలహీన వర్గాలకు ఇస్తున్నటు వంటి ప్రాధాన్యత,అద్భుతమని ఆయన పేర్కొన్నారు. బి.సి,లు తెలుగుదేశంపార్టీకిఎప్పుడుమద్దతుగాఉంటారని,ఈసందర్భ ంగా ఆయనగుర్తు చేశారు.జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు కి,ఈసందర్భంగా ప్రత్యేక ధన్యవాదా లుతెలియజేస్తున్నానని వివరించారు.

## 45మంది మహిళలకు చీరలు పూజా సామాగ్రి పంపిణీ.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి. ఆగష్టు 20.** పాలకొల్లు లోని వాసవి మాతా ఆలయం నందు గురువారం జరిగిన వరలక్ష్మి వ్రత పూజలో రాహుల్ సామాజిక సేవా సంస్థ అద్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు 45 మంది మహిళలకు చీర, జాకెట్, పసుపు కుంకుమ గాజులు పంపిణీ చేశారు. శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం పురష్క రించుకుని మహిళల జీవితంలో వరలక్ష్మి వ్రతం కొత్త వెలుగులు నింపాలని కోరుతూ మహిళలకు చీరలు పూజా పూజా సామాగ్రి అందచేసినట్లు రాహుల్ సామా జిక సేవా సంస్థ అద్యక్షులు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాధ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జోగి వెంకటేశ్వరరావు కొఠ్రగింజల హనుమంతురావు వీరా మల్లికార్జునుడు కెల్లా పెద్దిరాజు పెచ్చేటి కృష్ణాజి పిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**ప్రత్తిపాడు కాంగ్రెస్ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు**



**శంఖవరం: ఆగస్టు 20 (ప్రజాజ్యోతి న్యూస్)** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో స్వర్గీయ భారతరత్న శ్రీ రాజీవ్ గాంధీ గారి 81వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రివర్యులు మరియు సి డబ్ల్యూ సి ప్రత్యేక ఆహ్వానితులైన ఎం ఎం పల్లం రాజు ఆదేశాల మేరకు, కాకినాడ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానంద రావు గారి పిలుపుమేరకు ఏలేశ్వరం షిరిడి నగర్ లోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ ఆధునిక, అభివృద్ధి చెందిన, ఐక్య భారతదేశం కోసం రాజీవ్ గాంధీ గారు కన్న కలలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు, యువతపై ఆయనకున్న విశ్వాసం నేటికి మనకి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. దేశ ప్రగతి, సాంకేతిక అభివృద్ధి మరియు యువశక్తి సాధికారత కోసం ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దేశ ప్రగతి కోసం దారి చూపిన దార్శనిక నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు రామకుర్తి సూర్యనారాయణ, ఆలేటి అనిల్ కుమార్, కాకినాడ జిల్లా సెక్రెటరీ దొంతశెట్టి చంద్రశేఖర్, ఏలేశ్వరం కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ గోనపు శ్రీనివాసరావు, కాలేపల్లి గంగబాబు, పలివెల శివరామకృష్ణ, సీరం ఉమా, పెద్దిరెడ్డి వీరబాబు, తారు వీరబాబు, బుచ్చిరాజు, రాజేష్, మలిరెడ్డి కుసుమ, భవాని, పూజ, లక్ష్మీ, లావణ్య తదితరులు పాల్గొన్నారు,

# ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందచేసిన తుంగ నాగేశ్వరరావు.



**పోడూరు. ప్రజాజ్యోతి. ఆగష్టు 20.** ఆచంట మండలం వల్లూరు శివారు పెచ్చేటివారిపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణంకు గుంపర్రు లోని కారుణ్య ట్రస్ట్ అధినేత తుంగ నాగేశ్వరరావు ఒక లక్ష రూపాయలను విరాళంగా తనను మర్యాదపూర్వకంగా కలిసిన గ్రామ పెద్దలకు అందచే శారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించేందు కు ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించడం పట్ల గ్రామస్తుల తరపున గ్రామ పెద్దలు తుంగ నాగేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కారుణ్య ట్రస్ట్ అధినేత తుంగ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సేవతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కారుణ్య ట్రస్ట్ అండగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాండ్రే భూల త్రిమూర్తులు, జోగి సత్యనారాయణ, చిట్టూరి రాంబాబు, బొక్క సత్యనారాయణ, అనిశెట్టి భూషణం, పెచ్చేటి గోపి చిట్టూరి రాంబాబు బొక్క శ్రీనివాసరావు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా జన్మదిన వేడుకలు



**చెన్నూరు, ఆగష్టు 20:** చెన్నూరు మండలంలో కమలాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వర్యులు, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, పెద్దలు, మృదుభాషి, వినయశీలురు, కష్టకాలంలో పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు పోరాటాలు జరుపుతున్న యోధుడు, రాజకీయ దురంధరుడు శ్రీ పోచిమరెడ్డి రవీంద్రనా థ్ రెడ్డి గారి 69వ జన్మదిన వేడుకలు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బా రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ గారి ఆధ్వర్యంలో చెన్నూరు టౌన్ లోని జడ్.పి. హెచ్ హైస్కూల్ ఎదురుగా ఉండే వైయస్సార్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి అత్యంత ఘనంగా వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభి లాషులు, అభిమానులు, కార్యకర్తల మధ్య జరుపుకు న్నారు. ఈ కార్యక్రమమునకు మండల వైస్ ఎంపీపీ చిన్న, దేవగుడి భాస్కర్ రెడ్డి, అల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీటీసీ దుంప నాగిరెడ్డి, కొండపేట మాజీ సర్పంచ్ చంద్రయాదవ్, కొండపేట నాయకు లు నాగిరెడ్డి నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళా నాయకురాలు భాగ్యమ్మ, రామనపల్లి వైఎస్ఆర్సిపి నాయకులు, చల్ల వెంకటసుబ్బారెడ్డి (బాబు), ఓబులంపల్లె నాయకులు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, కుమార్ రెడ్డి, టీఎన్ చంద్రా రెడ్డి, ఉప్పరపల్లి నాయకులు, కొక్కిరాయపల్లి నాయకులు, శివాలపల్లె నాయకులు, దౌలతాపురం నాయకులు, బలిసింగా యపల్లి నాయకులు, శ్రీనివాస్ పల్లె నాయకులు,రాష్ట్ర నాయకులు అన్వర్ సాహెబ్, జిల్లా నాయకులు మరియు కోఆప్షన్ సభ్యులు వారిస్, జుమ్మన్, నూర్, ఆరిఫ్, ఖాజాపీర్, జిల్లా నాయకులు అబ్దుల్ రబ్, చెన్నూరు టౌన్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## ఎండపల్లిలో ఉచిత ఆధార్ క్యాంప్: నెట్ సమస్యతో ప్రజల అవస్థలు



**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం (ప్రజా జ్యోతి)** యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ క్యాంప్‌లో సర్వర్, నెట్‌వర్క్ సమస్యల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంప్‌నకు ఆధార్ సేవలు, మార్పుల కోసం స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే, ఉదయం నుంచే సచివాలయంలో ఇంటర్నెట్ నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో ఆధార్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ముఖ్యంగా పాఠశాలల నుంచి తమ పిల్లలను తీసుకువచ్చిన తల్లిదండ్రులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఒకవైపు స్కూల్ సమయం ముగుస్తున్నా పనులు కాకపోవడం, మరోవైపు నెట్ రాకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉచిత ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినప్పటికీ, సాంకేతిక లోపాల వల్ల పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఇక్కడి నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించి ఆధార్ సేవలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## బద్వేలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

**టీడీపీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి**




**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 20 (ప్రజా జ్యోతి)** బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కార మే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంప ఎర్రంపాలెం హై స్కూల్ కి 51,116అందజేత



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి) ఆగస్టు 20 :** స్థానిక రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందుచేత తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ మగ్దూం రఫీ 51,116 రూపాయలు ప్రతీ సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషికం అందచేయుటకు ఉపాధ్యాయులు పెదిరెడ్ల రాజు ప్రోత్సా హంతో పాఠశాల హెచ్‌ఎం కలుం అబ్బులుకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, లక్ష్మీనారాయణ,ణ కిరణ్ బాబు, రామకృష్ణ, సుబ్బారావు, తది ఇతరులు పాల్గొన్నారు

## పోలవరం నియోజకవర్గ అభివృద్ధి పనులపై గిరిజన సంక్షేమ మంత్రితో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు భేటీ



**అమరావతి (బర్రింకలపాడు ): ఆగస్ట్ 20 అమరావతి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** పోలవరం నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే శ్రీ చిర్రి బాలరాజు గురువారం రోజున గౌరవ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గంలోని ఐటీడీఏ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, గిరిజన ప్రాంతాల మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు తదితర అంశాలను ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే ఐటీడీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి అంశాలపై కూడా మంత్రి తో సవివరంగా చర్చించారు. పోలవరం నియోజకవర్గంలోని గిరిజన ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరగా, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి హామీ ఇచ్చారు. ఈ భేటీ ద్వారా పోలవరం నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభించనుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు.

## బీసీలకు న్యాయపరంగా చట్టపరంగా అందాల్సిన హక్కులు హామీల అసెంబ్లీలో చర్చించాలి

**బీసీల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి**

**బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు తిప్పిరెడ్డిపల్లి నాగేశ్వరరావు**



భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న నేటికీ బీసీలు అత్యంత వెనుకబడిన వర్గాలు గాని నేటికీ కొనసాగుతున్నారు పాలక ప్రభుత్వాలు అధికారంలోకి రావడం కోసం బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు కాబట్టి మా డిమాండ్లను పరిష్కరించాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు తిప్పిరెడ్డిపల్లి నాగేశ్వరరావు, డి. యం. ఓబులేసు యాదవ్,పెర్నపటి సుధాకర్ లు డిమాండ్ చేశారు స్థానిక చెన్నూర్ తాసిల్దార్ లో కలిసి 11 డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సం.. లకే పెన్షన్ అమలు చేయాలి బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి బిపి మండల్, చాకలి ఐలమ్మ జయంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి భూమిలేని వ్యవసాయ కూలీలుగా ఉన్న బీసీ కులాలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలి స్థానిక సంస్థల్లో బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్స్ అమలు చేయాలి పెండింగ్ లో ఉన్న సబ్సిడీ రుణాలను వెంటనే మంజూరు చేయాలి పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీ రీఅంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి బీసీ బాల బాలికలకు పక్కా వసతి గృహాలు ఏర్పాటు చేయాలి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్స్ కల్పించాలి బీసీ ఉద్యోగస్తులకు ప్రమోషన్స్ లో రిజర్వేషన్స్ కల్పించాలి మహిళా బిల్లులో బీసీ మహిళలకు రిజర్వేషన్స్ కల్పించాలి సామాజిక ఉద్యమాభివందనములతో తిప్పి రెడ్డిపల్లి నాగేశ్వరరావు జిల్లా అధ్యక్షులు బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ కడప జిల్లా కమిటీ

## పర్యాటక ప్రగతికి బాపట్ల కొత్త అడుగులు

**పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించేలా సమగ్ర ప్రణాళిక**



**బాపట్ల ఆగస్టు 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** సముద్రతీరం, ప్రకృతి అందాలు, చారిత్రక ప్రదేశాలకు నెలవైన బాపట్ల జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోంది. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు జిల్లాకు వచ్చే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పర్యాటక రంగ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు కీలక అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత మే 29న నిర్వహించిన తొలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించిన ఆయన, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో శాఖల మధ్య సమన్వయం కీలకమన్నారు. బాపట్ల పర్యాటక విశేషాలను ప్రపంచానికి పరిచయం చేసే (బే అఫ్ బాపట్ల) వెబ్‌సైట్‌ను మరింత విస్తృతంగా ప్రచారం చేయాలని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల పూర్తి సమాచారాన్ని అందులో పొందుపరచాలని సూచించారు. పర్యాటకులు సులభంగా సమాచారం పొందేలా వెబ్‌సైట్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని తెలిపారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 27న రాష్ట్ర ప్రభుత్వం అందించే పర్యాటక ప్రతిభా పురస్కారం బాపట్ల జిల్లాకు దక్కేలా అవసరమైన వివరాలతో దరఖాస్తు చేయాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్‌ను ఆదేశించారు.అలాగే సూర్యలంక, ఓడరేవు, రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం సముద్రతీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి టోల్‌గేట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. టోల్‌గేట్ల ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం సంబంధిత పంచాయతీకి, మిగిలిన 50 శాతం పర్యాటక అభివృద్ధికి వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి బెన్హర్, మత్స్యశాఖ సహాయ సంచాలకులు గాలిదేవుడు, అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బే ఆఫ్ బాపట్ల రూపకర్తకు అన్నం సతీష్ అభినందన



**బాపట్ల ఆగస్టు 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** సాంకేతికతను సృజనాత్మకంగా వినియోగిస్తూ బాపట్ల ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన విన్నకోట చాందినిశ్రీని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ అభినందించారు. గురువారం తన నివాసంలో ఆమెను అభినందించి భవిష్యత్ ప్రణాళికలపై మాట్లాడారు.యువతలోని ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తే మరిన్ని వినూత్న ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని సాంకేతికత ద్వారా ప్రజలకు చేరువ చేయాలనే ఆలోచన ప్రశంసనీయమన్నారు. శాస్త్రవేత్తలు, ప్రముఖుల స్ఫూర్తితో చాందినిశ్రీ మరిన్ని కొత్త ప్రయత్నాలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆమెకు తన ప్రోత్సాహం, సహకారం కొనసాగుతుందని తెలిపారు.

## ఏఐతో రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచారం



**బాపట్ల ఆగస్ట్ 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఆంగ్రూ వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ విభాగాధిపతి, సీనియర్ ప్రొఫెసర్ డా. జి. శివనారాయణ సూచించారు. వ్యవసాయ కళాశాలలో ఏఐపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.భూమి ఏఐ యాప్ ద్వారా మార్కెట్ ధరలు, వాతావరణ సమాచారం, చీడపీడల గుర్తింపు, నేల ఆరోగ్యం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీల వివరాలను రైతులు తెలుసుకోవచ్చున్నారు. పంట సమస్యలను ఫొటో ద్వారా గుర్తించి పరిష్కారం పొందే అవకాశం ఉందని యాప్ సహ వ్యవస్థాపకుడు మోహన్ కాటమనేని తెలిపారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. మండవ శ్రీనివాసరావు, డా. ఎం. ఉదయ్ భాస్కర్, డా. డి. నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి ని కలిసిన నాలుగో వార్డ్ వైసీపీ నాయకులు



**గుంతకల్లు ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జింకల రామాంజనేయులు మరియు గుంతకల్లు వైయస్సార్ పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని 4 వార్డ్ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి అవార్డులో సమస్యలు తెలియపరిచారు. రానున్న మున్సిపల్ ఎలక్షన్లో వైఎస్ఆర్ పార్టీకి బలమైన మెజార్టీ ఇవ్వాల్సిందిగా వారికి వెంకటరామిరెడ్డి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి 4వార్డ్ కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.

# ఈ ప్రభుత్వంలో బీసీలకు జరగదు న్యాయం

**బీసీలకు మోసం చేస్తున్న తెలుగుదేశం పార్టీ**

**ఎన్నికల హామీలు మరిచిన బాబు గారు**

**బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్**



**రాయచోటి ఆగస్టు 20 ప్రజా జ్యోతి** ఎన్నికల హామీలను అమలు చేయండి పాలన చేతకాకపోతే దిగిపోండి. అని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంపై మండిపడ్డారు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ప్రజలకు మోసం చేస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం.సూపర్ సిక్స్ అన్నారు సూపర్ గా మోసం చేశారు బీసీ లకు రక్షణ చట్టం ఏది? బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ 4000 రూపాయల పథకం ఏది?బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవులు ఏది? బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఏవి? బీసీల ఓట్లతో బీసీల మద్దతు బీసీల శ్రమతో గద్దెనెక్కుతున్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి చిత్తశుద్ధి ఉంటే బీసీ వర్గాలకు చెందిన వ్యక్తికి ముఖ్యమంత్రి పదవి ఇవ్వండి మీ పార్టీలో ఉన్న వ్యక్తికే ఆడబిడ్డ నీది ఏది? నిరుద్యోగ భృతి ఏది?ఫీజు రీయిమెంట్ ఏది? వసతి దీవెన ఏది? విద్యా దీవెన ఏది? నేతన్న నేస్తం ఏది? మత్స్యకారులకు 20000 రూపాయలు ఏది? రజకులకు నాయి బ్రాహ్మణులకు పదివేల రూపాయలు ఏది?ఎంతకాలం ఈ మోసం ఎంతకాలం ఈ అన్యాయం ఎంతకాలం ఈ దగా అబద్దాలతో మోసాలతో మాయ మాటలతో ఎంతకాలం బీసీలను మోసం చేస్తారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 44 సంవత్సరాలు అయింది బీసీలకు జరిగిందేంది జరుగుతున్నది ఏంటి జరగబోయేది ఏమిటి తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక అంటారు కానీ అదే తెలుగుదేశం పార్టీ బీసీల వెన్ను విరిచి వాళ్లకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తున్నది మాయ మాటలు చెప్పి బీసీలను గత 44 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ తెలుగుదేశం ప్రభుత్వం మోసం చేస్తూనే ఉన్నాది, బీసీలపైన మీకు చిత్తశుద్ధి ఉంటే ప్రేమ ఉంటే 33 శాతం సటసభల్లో రిజర్వేషన్ అమలు బిల్లును పార్లమెంట్లో పాస్ చేయించండి అదేవిధంగా బీసీలకు రక్షించటం నుండి బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు 4000 రూపాయలు ఇవ్వండి బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వండి బీసీ జనగణలో కులగణన చేయండి బీసీలకు సమన్యాయం సమధరం సామాజిక న్యాయం చేసి చూపించండి మీ పాలనలో మీ ప్రభుత్వంలో బీసీలకు సంక్షేమం లేదు అభివృద్ధి లేదు అధికారం లేదు ఉన్నదంతా ఒకటే మాయ మాటలు చెప్పి బీసీలను మోసం చేయడం బాబుపాలనలో బీసీలు మోసపోతూనే ఉన్నారు అని బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ ప్రభుత్వంపై మండిపడ్డారు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సురువాసి ఈశ్వర్ ప్రసాద్, బుజ్జి బాబు, యూత్ లీడర్ అనిల్, పాల్గొన్నారు.

## వి.ఆర్.పురం, మండలం,రేఖపల్లి,పి.హెచ్.సి!వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో !.. డాక్టర్ నీలుఫర్ పర్యవేక్షణలో!..ప్రపంచ దోమల దినోత్సవం!..






**వి.ఆర్.పురం, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ధోమకాటు పెను ముప్పు, ధోమ తెరకట్టు ధోమను నివారించు, ధోమకాటు వద్దు, ధోమతెర ముద్దు, దోమలను నియంత్రించడం మన అందరి బాధ్యతగా భావిద్దామని రేఖపల్లి పి.హెచ్.సి,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలుఫర్, సూచించారు. గురువారం, రేఖపల్లి, పి.హెచ్. సి, సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. మావహారం, నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.ప్రపంచదోమల దినోత్సవం సందర్భంగా డాక్టర్ నీలుఫర్, మాట్లాడుతూ, మన మందరం కలసి ముందుకు అడుగు వేస్తే దోమలను నిర్మూలించగలం, వ్యాధులను నియంత్రించగలం, ఆరోగ్యకరమైన, సమాజాన్ని నిర్మించగలమని ఆమె పేర్కొన్నారు.సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త మలేరియా అనేది ఆడ అనాఫిలిస్ దోమవల




నసోకుతుందనే విషయాన్ని 1897 ఆగస్టు 20న ప్రపంచానికి తన పరిశోధన, ద్వారా తెలియ పరచుట వలన ఆగస్టు 20వ తారీకున అంతర్జాతీయ దోమల నివారణా దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని వివరించారు.ప్రతీఒక్కరు "ఫ్రైడే" డ్రైడే" కార్యక్రమం గురించి అవగాహన కలిగి సమాజానికి దోమల నిర్మూలనలో తమ వంతు కృషి చేయాలని, పిలుపునిచ్చారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్య, సాధారణ, వంటి కీటక జనిత వ్యాధులు నిర్మూలనలో మంచి పాత్ర పోషించాలని, సమిష్టి కృషి చేయాలని ప్రతిజ్ఞ బునారు.ప్రతీ ఇంట్లో నీరునిల్వలులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రతీ గ్రామంలో, యాంటీ లార్వా ఆఫరేషన్ చేస్తున్నామని, రాత్రి పూట ఫాగింగ్ (పొగపెట్టుట)వంటి కార్యక్రమాలు సైతం జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమం పి.హెచ్.ఎన్ భద్రకాళి, ఏ.ఎన్. ఎం,లు చంద్రమ్మ, పార్వతీ, లక్ష్మీ, మహేశ్వరి, శశికళ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సతీష్, రత్తయ్య, సి.హెచ్.వో,పవన్ కళ్యాణ్, అనూష, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కార్మికులకు నూనె,సోపులు, చెప్పులు ఇవ్వాలి డైలీ వేజెస్ వర్కర్స్ కు ఆప్కాస్ లో చేర్చాలి**

**ధర్నాలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పోరుమావిళ్ళ సుబ్బారాయుడు**




**రాయచోటి ఆగస్టు 20 ప్రజా జ్యోతి** రాయచోటి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పోరుమావిళ్ళ సుబ్బారాయుడు డిమాండ్ చేశారు.గురువారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని చేస్తున్నారని అన్నారు. అయితే వారి కనీస అవసరాలను కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం, నూనె, సబ్బులు, చెప్పులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, కార్మికులకు వారి హక్కైన పీఎఫ్ మొత్తాన్ని అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని, అవసరానికి అనుగుణంగా సిబ్బందిని నియమించి పనిభారాన్ని సమానంగా పంచాలని అన్నారు.విధి నిర్వహణలో పనిచేస్తూ మరణించిన కార్మికులు, అలాగే పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు వారసత్వ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.అదేవిధంగా రాయచోటి మున్సిపాలిటీలో పనిచేస్తున్న అర్హులైన మున్సిపల్ కార్మికులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా మున్సిపాలిటీలలో సేవలందిస్తున్న కార్మికులకు సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.కార్మికుల సమస్యలపై అధికారులు తక్షణమే చర్చించి పరిష్కార చర్యలు చేపట్టకపోతే, మున్ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పోరుమావిళ్ళ సుబ్బారాయుడు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు నేలపాటి శ్రీనివాసులు, దేవా, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ , కేశవరావు, వెంకటేష్,హరి, సరోజా, పద్మావతి, దుర్గా భవాని, కృష్ణ వేణీ, సుజాత తదితరులు పాల్గొన్నారు

# దోమల నివారణపై అవగాహన ర్యాలీ






**కూనవరం ఆగస్టు 20. ప్రజా జ్యోతి కూనవరం:**ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని కూనవరం, కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని ప్రజలకు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.పరిసరాల పరిశుభ్రత, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు.
దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కల్పించి వీటిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వినియోగించాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కూలర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత టైర్లు తదితర వస్తువుల్లో నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసమూర్తి దొర, కూనవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చేతన్ కుమార్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఎంఫీహెచ్‌ఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయం చేయాలి!..

**మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి!..**

**మంత్రిని కలిసిన కూటమి నేతలు!..**

**మండలతెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వి.ఆర్.పురం,ఆగస్టు. 20(ప్రజాజ్యోతి ప్రతినిధి)** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా నిర్వాసితులైన వడ్డిగూడెం గ్రామ ప్రజలు తమపునరావాస సమస్యలపరిష్కారంకోసం గురువారం అమరావతిలో రాష్ట్ర జల వనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ను, బొర్ర నరేష్ కుమార్,తో కలిసి గ్రామస్తులు, తమ సమస్యలను వివరించారు. వడ్డి గూడెం గ్రామ నిర్వాసితుల కోసం కొత్తపల్లి, ప్రాంతంలోఆర్"అండ్"ఆర్ కాలనీ నిర్మాణానికి సేకరించిన భూమి తమకు, అనుకూలంగా లేదని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఉపాధి అవకాశాలు, తాగునీటి సౌకర్యం,జీవనోపాధికి అవసరమైన వనరులు సక్రమంగా లేవని వివరించారు. పున రావాసం పేరుతో తమనుఉపాధి,మౌలిక సదుపాయాలకు దూరంగాఉన్న ప్రాంతానికి తరలిస్తే భవిష్యత్తులో, తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వివరించారు. తమ గ్రామ ప్రజల జీవన పరిస్థితులను దృష్టిలోఉంచుకుని తాడ్వాయి,లేదా తిరువూరు ప్రాంతంలో ప్రత్యామ్నాయంగా ఆర్"అండ్"ఆర్ కాలనీ ఏర్పాటు చేసి,అక్కడే తగిన మౌలిక సదుపాయాలతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి నిమ్మల రామానాయుడిని నిర్వాసితులుకోరారు.పునరావాసం కేవలంఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పూర్తికాదని, నిర్వాసిత కుటుంబాలకు భవిష్యత్తులో జీవనోపాధి కొనసాగేలా ఉపాధి అవకాశాలు, తాగునీరు,రహదారులు తదితర సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వడ్డిగూడెం నిర్వాసితులు వివరించిన సమస్యలను, మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా విన్నారని,నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావాన్ని వారువ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తాం!..రంపచోడవరం నియోజకవర్గ శాసన సభ్యురాలు శిరీషాదేవి!..ఇదిలా ఉండగా రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి,కూడా వడ్డిగూడెం,నిర్వాసితుల సమస్యలపైస్పందిస్తూ,క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి నిర్వాసితులకు న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటామని,హామీ ఇచ్చినట్లుగ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కలిసి తమసమస్యలకుశాశ్వత పరిష్కారంచూపాలని వడ్డిగూడెం పోలవరం నిర్వాసితులు విజ్ఞప్తి చేశారు.

# నిర్వాసితులను నిండా ముంచుతున్న కూటమి ప్రభుత్వం

**48 గ్రామాలకు ఒకేసారి ఆర్అండ్ఆర్**

**ప్యాకేజీ ఇవ్వాలి: సీపీఎం**

**కూనవరం: ఆగస్టు 20 ప్రజా జ్యోతి** పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను కూటమి ప్రభుత్వంతో పాటు టీడీపీ నాయకులు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఎం మండల కమిటీ సభ్యులు ఆవుల ఉపేంద్రరావు విమర్శించారు. కూనవరంలో మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూనవరం మండలంలో సుమారు 48 గ్రామాలు ముంపునకు గురవుతుంటే, 41 కాంటూరు పేరుతో కేవలం 9 గ్రామాలను మాత్రమే ప్రభుత్వం ప్రకటించడం సమంజసం కాదన్నారు. నిర్వాసితుల్లో వ్యతిరేకత రాకుండా కొంతమంది టీడీపీ నాయకులు అధికారుల వద్దకు ప్రజలను తీసుకెళ్లి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ముంపునకు గురవుతున్న 48 గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం వంటి అంశాలపై టీడీపీ నాయకులు మంత్రుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో కూడా ప్రాజెక్టులో మునిగిపోతున్న ప్రజల సమస్య లను ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. నిర్వాసితులపై కూటమి నాయకులు చూపుతున్నది కపట ప్రేమేనని ఆయన ఎద్దేవా చేశారు.



**సీపీఎం ప్రధాన డిమాండ్లు:**

ముంపునకు గురవుతున్న 48 గ్రామాల నిర్వాసితులకు ఒకేసారి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి.2027 మార్చి కంటే ముందే ప్యాకేజీని పూర్తిగా పంపిణీ చేసి, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి.భూ నష్టపరిహారాన్ని 2027 మార్చి లోపు అందజేయాలి.18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్అండ్ఆర్ కాలనీకి తరలించే సమయానికి వయస్సును లెక్కించి ప్యాకేజీ ఇవ్వాలి.గిరిజనులకు భూమికి భూమి పథకంలో సాగునీటి వసతి ఉన్న భూమిని అందించాలి.సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, మడకం నాగమణి, ఎంపీటీసీలు ధర్మల అమ్మాజీ, కారం జయసుధ, మాజీ సర్పంచ్ బుగ్గ వెంకమ్మ, మండల కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్, తెల్లం తమ్మయ్య, మడకం సత్యనారాయణ, ఉయిక కన్నయ్య, మహిళా సంఘం నాయకురాలు గుండం బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వర్ల రామయ్యకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలిపిన దళిత ఐక్యవేదిక నాయకులు

**గుంతకల్లు ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** గవర్నర్ కోటాలో వర్ల రామయ్య కి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దళిత ఐక్య వేదిక ఏల్లిపాయల ఆనంద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. గుంతకల్లు పట్టణం అంబేద్కర్ గ్రంథాలయం దగ్గర ఐక్యవేదిక పట్టణ అధ్యక్షులు ఎల్లిపాయల ఆనంద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తలారి వెంకటేష్ దళిత నాయకులు డిష్ మధు మాట్లాడుతూ వర్ల రామయ్య కి ఎమ్మెల్సీ పదవి లభించడం పట్ల దళిత వర్గాల్లో ఆనందం నెలకొన్నదన్నారు. సామాజి క న్యాయం, దళితుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి ఈ అవకాశం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. వర్ల రామయ్య కి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, కూటమి పెద్దలకు దళిత ఐక్య వేదిక తరఫున ప్రత్యేక కృతజ్ఞత లు, ధన్యవాదాలు తెలిపారు. వర్ల రామయ్య ఎమ్మెల్సీగా ప్రజల సమస్య లను శాసనమండలిలో సమర్థవంతంగా వినిపిస్తూ, దళితులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్న తికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక నాయకులు రామ్మూర్తి, మహానంది మస్తాన్ లక్ష్మీనారాయణ థామస్ నవీన్ కౌశిక్ చిన్ని చరణ్ దేవరాజ్ ఈశ్వర్ హర్ష గౌతం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## 22 -ఏ ఎర్రర్ ఫ్రీ విలేజ్ గా బల్లిపాడు తహసీల్దార్ లక్ష్మీ లావణ్య వెల్లడి



**తాళ్లపూడి, ఆగస్టు 20, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు రెవెన్యూ గ్రామాన్ని 22–ఏ ఎర్రర్ ఫ్రీ విలేజ్ గా గుర్తించినట్లు మండల తహసీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. గురువారం బల్లిపాడు గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎటువంటి ప్రైవేట్ వ్యక్తుల భూములు కలిసి లేవని, రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని తెలియజేశారు.ఈ గ్రామసభలో రైతుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు, విజ్ఞప్తులు రాలేదని, గ్రామ రెవెన్యూ రికార్డులన్నీ పూర్తిగా సక్రమంగా ఉన్నందున ఈ గ్రామాన్ని ఎర్రర్ ఫ్రీ విలేజ్ గా ప్రకటించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు

## కలెక్టర్, ఎస్పీకి కుమ్మర శాలివాహన సంఘం మెమోరాండం

**ఆత్మహత్య కేసుపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**శంకవరం: ఆగస్టు 20,కాకినాడ (ప్రజా జ్యోతి న్యూస్)** కాకినాడ టిల్ల పూడి నూకరాజు కుటుంబ సభ్యుల ఆత్మహత్య పై తగిన విచారణ జరిపి సాబిద్ ఖాన్ అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కుమ్మర శాలివాహన సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షులు టిల్ల పూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కలెక్టర్ హరేంద్రప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ లకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, స్పందిస్తూ ఇప్పటికే ఈ కేసును చాలా సీరియస్ గా తీసుకున్నామని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని తెలిపారు. ఎస్పీ బిందు మాధవ్, మాట్లాడుతూ ఇప్పటికే ఐదు టీములు పనిచేస్తున్నాయని, త్వరలోనే సాబిద్ ఖాన్ ను అదుపులోకి తీసుకుని కోర్టు ముందు హాజరుపరుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ భీమా బత్తుల సత్యనారాయణ, సెక్రటరీ నారాయణరావు, ట్రెజరర్ సుబ్బారావు, ఆకేటి రాంబాబు, వైస్ ప్రెసిడెంట్, వైస్ సెక్రటరీలు టిల్ల పూడి విశ్వనాథం, కాకినాడ జగన్నాధపురం శాలివాహన పెద్దలు, జిల్లా శాలివాహన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- దోమల నివారణతో మలేరియాను నియంత్రణ
- తాడివలస పి. హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్
- పురవీధుల్లో మలేరియా పై అవగాహన ర్యాలీ



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్:**ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ,దోమల నివారణతో మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధిని నియంత్రించవచ్చునని తాడివలస పి. హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్,మలేరియా డెంగ్యూ సబ్ యూనిట్ ఆఫీసర్ సురేష్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎప్పటికప్పుడు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఇంటిలోకి దోమలు ప్రవేశించకుండా దోమ తెరలు వినియోగించాలన్నారు. తలనొప్పి జ్వరం ,వణుకు వంటి లక్షణాలు కనిపిస్తే సమీప పి. హెచ్.సి రక్త పరీక్షలో చేయించుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే మలేరియా వంటి వ్యాధిని నివారించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈ.ఓ పొన్నాడ జగదీష్ ,పారామెడికల్ సిబ్బంది , జె లక్ష్మీ నారాయణ జి రమేష్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టళ్లలో తనిఖీ - లోపాలపై కలెక్టర్ సీరియస్

**భద్రత పారిశుధ్యంపై ఆదేశాలు**

**భోజన నాణ్యతపై ఆరా**



**బాపట్ల ఆగస్టు 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతులు, నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల, బాలుర వసతి గృహాలను పరిశీలించి హాజరు, భోజనం, పారిశుధ్యం, భద్రత తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.బాలికల హాస్టల్‌లో విద్యార్థుల భద్రత కోసం ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. బాలుర హాస్టల్‌లో భోజనశాలలో తగిన వెలుతురు, గాలి ఉండేలా ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల హాజరులో వ్యత్యాసాలు, భోజన నాణ్యతపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని దాతల సహకారంతో వారం రోజుల్లో సమకూర్చాలని గిరిజన సంక్షేమ అధికారులను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి మొక్కలను సంరక్షించాలని సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అమర్ సుబ్బయ్య, తహసిల్దార్ సలీమా, మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, వార్డెన్లు, సిబ్బంది ఉన్నారు.

# శాసన మండలిలో ఎమ్మెల్సీ

**బొత్సను దూషించడం ప్రజాస్వామ్యానికే అవమానం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**
**- సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తిని అసభ్య పదజాలంతో సంబోధించడం అచ్చెన్న అహంకారానికి నిదర్శనం**
**- ప్రతిపక్ష నేత హోదాలో బొత్స అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మంత్రి అచ్చెన్నది**
**- వ్యక్తిగత దూషణలకు దిగడం శాసన సభ సాంప్రదాయాలను అపహాస్యం చేయడమే**
**- అధికారం ఎవరికీ శాశ్వతం కాదు అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారు**




**శ్రీకాకుళం ప్రజాజ్యోతి న్యూస్:** శాసనమండలిలో వైసిపి పక్ష నేత,మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు బొత్స సత్యనారాయణపై రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలపై మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడిని శాసనమండలి వంటి గౌరవప్రదమైన వేదికపై అసభ్య పదజాలంతో సంబోధించడం అచ్చెన్నాయుడి అహంకారానికి సంస్కారహీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు ప్రభుత్వం పాలన వైఫల్యాలను ప్రతిపక్ష నేతగా బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రశ్నిస్తుంటే, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మంత్రిపై ఉందన్నారు. అయితే సమాధానం చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని, శాసనసభా సంప్రదాయాలను అపహాస్యం చేయడమేనని విమర్శించారు. బొత్స సత్యనారాయణను 'దద్దమ్మ' అని సంబోధించడం ఏ రకమైన సంస్కారం అని ,సభలో తోటి సభ్యులను గౌరవించాల్సింది పోయి నోటికొచ్చినట్లు మాట్లాడటం దారుణమన్నారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ బీసీ నాయకుడిని అవమానించే హక్కు అచ్చెన్నాయుడికి ఎవరు ఇచ్చారని తమ్మినేని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో విపక్ష నేతలను కించపరిచేలా మాట్లాడితే ప్రజలు సహించరని ఆయన అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు ,ప్రజలు చూస్తున్నారు ,ప్రజలు వింటున్నారు.అహంకారంతో వ్యవహరిస్తే రేపు ప్రజలే గేట్లు వేస్తారని హెచ్చరించారు. శ్రీకాకుళం, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అచ్చెన్నాయుడు చేసిన కృషి ఏమిటో ప్రజలకు చెప్పాలని తమ్మినేని డిమాండ్ చేశారు.రెండుసార్లు మంత్రిగా పనిచేసిన ఆయన ఉత్తరాంధ్రకు ఏం చేశారో వివరించాలన్నారు. అచ్చెన్నాయుడిపై ఉన్న అవినీతి ఆరోపణలు, గతంలో ఎదుర్కొన్న వివాదాలను ప్రస్తావిస్తూ ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు.అయితే వ్యక్తిగత ఆరోపణలకు బదులుగా ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండి సొంత నియోజకవర్గంలో ఎరువుల కోసం క్యూలో నిలబడిన మహిళా రైతు మృతి చెందిన ఘటనపై కూడా తమ్మినేని ప్రశ్నలు సంధించారు. కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించని మంత్రి, రాష్ట్రంలోని రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారని నిలదీశారు.బీసీ నేతను అవమానించడం సిగ్గుచేటు బీసీల సంక్షేమం, బీసీ రిజర్వేషన్లపై సభల్లో చర్చ జరుగుతున్న సమయంలోనే మరో బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేతను బహిరంగంగా దూషించడం సిగ్గుచేటని తమ్మినేని అన్నారు.బీసీల పక్షపాతిగా చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మరో బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నేత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడమని చంద్రబాబు చెప్పారా..బీసీ నేతలను కించపరచడమే కూటమి ప్రభుత్వ విధానమా అని ఆయన ప్రశ్నించారు.ఉత్తరాంధ్రలో,ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో కాపు సామాజికవర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని ఆ వర్గం ప్రజలు గమనిస్తున్నారని తమ్మినేని అన్నారు.రాబోయే ఎన్నికల్లో ప్రజలు, ముఖ్యంగా కాపు సామాజికవర్గం అచ్చెన్నాయుడికి తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు.అచ్చెన్నాయుడు తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బొత్స సత్యనారాయణకు,రాష్ట్ర బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని తమ్మినేని డిమాండ్ చేశారు.శాసనమండలిలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్పందించాలని కోరారు.శాసనమండలి ప్రజాస్వామ్యానికి ప్రతీక. అక్కడ చర్చ జరగాలి ,వాదనలు జరగాలి ,ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి సమాధానాలు చెప్పాలి కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. అచ్చెన్నాయుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.శ్రీకాకుళం జిల్లా పరువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ నాయకుడిపైనా ఉందని, వ్యక్తిగత దూషణలు, అహంకారపూరిత వ్యాఖ్యలతో జిల్లా పరువు తీయడం ఎవరికీ తగదని తమ్మినేని హితవు పలికారు.

# వికసిత్ భారత్ జి రామ్ జి పథకంతో గ్రామాల అభివృద్ధికి విస్తృత అవకాశాలు





**- 318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించాలి**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టేందుకు అవకాశం ఉన్న 318 రకాల పనులపై ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులకు ఎంపిడిఓ ఎస్ వాసుదేవ రావు పూర్తి స్థాయి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్థానిక అవసరాలను గుర్తించి, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను చేపట్టే విధానంపై అధికారులకు వివరించారు.అనంతరం ఎంపీడీఓ ఎస్. వాసుదేవరావు మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు.318 రకాల పనులను గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.గ్రామాల్లో ప్రజలకు అవసరమైన ఉపాధి,మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పనులను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పథకంపై పూర్తి అవగాహన కలిగి ఉండి, గ్రామస్థులకు కూడా వివరించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను పారదర్శకంగా చేపట్టి గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రఘునాథ్ , ఎంపిడిఓ సాహిని తహసీల్దార్ ఆర్ వెంకటేష్ మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, పి. ఏ.సి.ఎస్ చైర్మెన్ వండాన మురళీ, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం శ్రీనివాస బాబు పాల్గొన్నారు. వీరితోపాటు రిసోర్స్ పర్సన్లుగా ఏపీ. ఓ పైల శ్రీనివాస్ రావు ఈ.సి ఈశ్వర్ పాల్గొని అవగాహన కల్పించారు.

# దోమల నివారణే లక్ష్యం.. ప్రజారోగ్యమే ధ్యేయం!

**మానవహారంతో చైతన్యం..నినాదాలతో అవగాహన**
**డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దినకర్ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమం**

**ఎటపాక, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎటపాక మండలంలోని నెల్లిపాక , లక్ష్మీపురం , గౌరీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రల పరిధిలో ప్రజలకు దోమల నివారణ, దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గౌరీదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవి, వైద్యాధికారి డాక్టర్ దినకర్ ఆధ్వర్యంలో నందిగామ, చిమిలివాగు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది మానవహారం నిర్వహించి దోమల నివారణపై ప్రజలకు సందేశాన్ని అందించారు. అనంతరం దోమల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన నినాదాలు చేస్తూ గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నినాదాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ దినకర్ మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి పలు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని తెలిపారు. దోమల వృద్ధికి అనుకూలమైన నీటి నిల్వలను తొలగించాలని, ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి తొట్టెలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమతెరలను వినియోగించడం, సాయంత్రం వేళల్లో దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం, వాంతులు తదితర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యాధికారులు సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమలను నియంత్రించి సీజనల్ వ్యాధులను అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గౌరీదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగ మానవహారం, నినాదాలతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు.

## మహిళలు - విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన



**బాపట్ల ఆగస్టు 20 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్పై మహిళలు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు హెడ్‌క్వార్టర్స్ శక్తి టీమ్ ఆధ్వర్యంలో గురువారం సూర్యలంక సముద్రతీర రహదారిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో, మహిళా ఎస్ఐ చంద్రావతి సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో శక్తి యాప్ ఉపయోగాలు, మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందే విధానం, యాప్ ద్వారా ఫిర్యాదు చేసే ప్రక్రియపై వివరించారు. మహిళలు, విద్యార్థులు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని, శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన పెంచుకోవాలని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సిబ్బంది, ముని బాబు, స్వప్న, జానకి, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకుడు మాతృమూర్తిని మరణించడం వలన ప్రగాఢ సానుభూతి తెలిపిన వైఎస్ఆర్సిపి నాయకులు



**ఆగస్టు 20 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జ్ శ్రీనివాస్ నాయుడు :-** ఉరవకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర పీఏసీ మెంబర్ శ్రీ.వై.విశ్వేశ్వర్ రెడ్డి గారు విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ. వై.ప్రణయ్ కుమార్ రెడ్డి గారి ఆదేశాలతో వజ్రకరూరు మండలం పాత కడమలకుంట గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ మాజీ డీలర్ వీ సుంకన్న గారి మాతృమూర్తి వీ. హనుమక్కగారు 86 మరణించడం ఎంతోబాధాకరం శ్రీ.వై. విశ్వేశ్వర్ రెడ్డి గారి ఆదేశాలతో వారి పార్థివదేహాన్ని సందర్శించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బిందెల సోమశేఖర్ రెడ్డి ఉరవకొండ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు డిష్ సురేష్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లెల జగదీష్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కీష్టా బీమా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించడం జరిగింది.వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము అని తెలిపారు.నివాళులర్పించిన వారిలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటేష్ ఛా.కిష్టప్ప ఎర్రిస్వామి. రామాంజనేయులు వీ. సురేంద్ర వీ. సుంకప్ప వీ. ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## దేశీ శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్ల పంపిణీ

**గోల్డ్ మెడల్ సాధించిన గూడపాటి విజయభాస్కర్**




**ఎటపాక, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** దేశీ శిక్షణ పూర్తి చేసిన ఇన్‌పుట్ డీలర్లకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ డిప్లొమా సర్టిఫికెట్లను అందజేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన 38 మంది శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా అపరాలు, కూరగాయలు, ఆరుతడి పంటల సాగు వైపు రైతులను మళ్లించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, దేశీ శిక్షణ పొందిన ఇన్‌పుట్ డీలర్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తూ చైతన్యపరచాలని సూచించారు.దేశీ శిక్షణలో ప్రతిభ కనబరిచిన ఇన్‌పుట్ డీలర్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. గోల్డ్ మెడల్ సాధించిన గూడపాటి విజయభాస్కర్ (చర్ల), సిల్వర్ మెడల్ సాధించిన ఆనంగి కళ్యాణ్ (చంద్రుగొండ), బ్రాంజ్ మెడల్ సాధించిన ఆవుల శివప్రసాద్ (చర్ల), కంటే శివరామకృష్ణ (గౌరిదేవిపేట)లను శాలువాలు కప్పి సన్మానించారు. జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబురావు మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులను ఆరుతడి పంటలు, అపరాలు, కూరగాయల సాగు వైపు ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి. డేవిడ్ జయపాల్ రావు (రిటైర్డ్ ఏడీఏ), దేశీ శిక్షణకు సంబంధించిన అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎండీవోలు, ఎంఆర్వోలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన డ్రామా పిడి సలీం భాష..




**కంబదూరు ఆగస్టు 20: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ ఛాంబర్ నందు వీబీ గ్రామ్ జీ ఉపాధి హామీ సిబ్బంది తో డ్వామా పీడీ సలీం భాషా గురువారం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.. ఉపాధి హామీ చట్టం మేరకు జాబ్ కార్డు కలిగిన ప్రతి శ్రామికుడికి 125 రోజులు పాటు కల్పించాలని ఆయన సిబ్బంది ని ఆదేశించారు. జలధార, జల హారతి, , పొలాలకు వెళ్ళుటకు మట్టి రోడ్లు, పారం ఫండ్, ఫీడర్ చానెల్, నీటి నిలువ గుంతలు, ఇంకుడు గుంతలు, చెత్త నిలువ తదితర పనులను వేగవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.అదేవిధంగా శ్రామికుడి వేతనాలను సకాలంలో వారి, వారి ఖాతాలలో జమ అయ్యేలా చూడాలన్నారు.పనికి వెళ్ళిన ప్రతి శ్రామికుడి ముఖ హాజరు చేయాలని ఆయన పేర్కొన్నారు..ఈ సమీక్ష సమావేశంలో ఏ పీ ఓ శ్రీదేవి, ఈసీ ఉస్మాన్ వలి, సాంకేతిక, క్షేత్ర సహాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల తనిఖీ ఓటర్ల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



**నందవరం, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** గ్రామపంచాయతీల పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలకృష్ణ రెడ్డి, ఎంపీడీవో పుల్లయ్యతో కలిసి పెద్దకొతిలి గ్రామపంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. పెద్దకొతిలి ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 6 పోలింగ్ స్టేషన్లు, సంజీవపురం ఎంపీపీ పాఠశాలలోని 4 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంపులు, ఫర్నిచర్, భద్రత తదితర మౌలిక వసతులను తనిఖీ చేసి, వృద్ధులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని బాలకృష్ణ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్, పంచాయతీ అభివృద్ధి అధికారి, ఉపాధ్యాయులు సచివాలయ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక నిఘా..24 గంటల వైద్య సేవలు అందేలా చర్యలు

**ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశం: అర్ధరాత్రి వేళ పిఠాపురం పి హెచ్ సి ల్లో తనిఖీలు చేసిన ఓదూరి కిషోర్**





**కాకినాడ జిల్లా,పిఠాపురం నియోజవర్గం (ప్రజా జ్యోతి)** పిఠాపురం నియోజకవర్గం లోని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రివేళ వైద్య సేవల పరిస్థితిపై ఆకస్మిక పరిశీలన నిర్వహించారు. పిఠాపురం ఎమ్మెల్యే శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఫైల్ మాన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్ నిన్న రాత్రి పలు పి హెచ్ సి లను సందర్శించి వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రాత్రి వేళల్లో ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా, వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా, అత్యవసర మందులు, ఇతర ఔషధాల నిల్వలు సరిపడా ఉన్నాయా, ఆరోగ్య కేంద్రాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయా అనే అంశాలను పరిశీలించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్యం అందుబాటులో ఉండటం అత్యంత కీలకమని ఓదూరి కిషోర్ పేర్కొన్నారు. పి హెచ్ సి ల్లో వైద్యులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని తెలిపారు.పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ప్రభుత్వ వైద్య సేవలు అందించడమే ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ లక్ష్యమని, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచి అత్యవసర సమయాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.

# గొల్లప్రోలు 17వ వార్డులో నరకప్రాయం

**రోడ్లు, డ్రైనేజీలపై మహిళలు ఆవేదన**
**మురుగునీటితో వీధులు.. పెరుగుతున్న దోమల ఉధృతి**
**పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఈ దుస్థితా?**
**సమస్యలు పరిష్కరించాలని అధికారులకు మహిళలు విజ్ఞప్తి**





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు 17వ వార్డులో కనీస మౌలిక సదుపాయాలు కరువై స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార్డులో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారడమే కాకుండా, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోందని, దీంతో పరిసర ప్రాంతాలన్నీ అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయని వారు పేర్కొన్నారు. ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీనివల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకరమైన వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోనే**

**ఇలాంటి పరిస్థితులా?**

డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోనే ఇలాంటి దారుణ పరిస్థితులు నెలకొనడం బాధాకరమని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, వార్డులో కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు వల్లభశెట్టి గంగ, కెలంగి ఆదిలక్ష్మి, అనిశెట్టి తులసి, గొల్లపల్లి గంగ, యాళ్ల జ్యోతి, భారతల లక్ష్మి, గంట వేణి, వడ్డీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఘనంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 20 (ప్రజా జ్యోతి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు పోరుమామిళ్లలో ఘనంగా జరిగాయి. పోరుమామిళ్ల లోని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి నివాసంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. యువజన విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి, బద్వేల్ నియోజకవర్గ బూతుకన్వీనర్ల సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, గజమాలతో రవీంద్రనాథ్ రెడ్డిని ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సేవకు నిరంతరం కృషి చేస్తున్న రవీంద్రనాథ్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్, మైదుకూరు నియోజకవర్గ పరిశీలకుడు వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, మడకల రఘురామి రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగ కమిటీ కార్యదర్శి గుర్రంపాటి రమణారెడ్డి, జిల్లా రైతు విభాగ కార్యదర్శి పంగచెన్నకృష్ణారెడ్డి, చంద్ర మరియు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

**వైద్యాధికారి సంపత్ కుమార్**



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి ఆగష్టు 20** మండల కేంద్రం లోని ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక వైద్యాధికారి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ,వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు వివరించారు.?దోమల నివారణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించినప్పుడే దోమల రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంద న్నారు.1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్ రాస్ సికింద్రాబాద్‌లో పరిశోధనలు చేసి ఆడ అనాఫిలిస్ దోమ ద్వారానే మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని నిరూపించారని,ఆ చారిత్రక ఆవిష్కరణకు గుర్తుగా ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.? దోమతెర అనేది ఆరోగ్య రక్షణ కవచమని,దోమల నియంత్రణకు దోమతెర సులభమైన, అత్యంత ప్రభావవంతమైన రక్షణ సాధనమన్నారు.ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు,వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కిటికీలకు మెష్‌లు అమర్చుకోవడం,ఒళ్లంతా కప్పే దుస్తులు ధరించడం, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు.?ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు పుష్పరాజ్, లక్ష్మీదేవి,హెల్త్ అసిస్టెంట్లు మాధవ,వెంకటరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రమణ కుమార్ మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే యువ నాయకుడు రాజేంద్ర గౌడ్

**ఘనంగా టిడిపి యువనేత ఈ.రాజేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు**
**యువ నాయకుడికి అభినందనల వెల్లువ**



**హోళగుంద, ఆగస్టు 20, ప్రజా జ్యోతి న్యూస్ -** మండల కేంద్రంలో గురువారం తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోవింద్ గౌడ్ తనయుడు, యువ నాయకుడు ఈ. రాజేంద్ర గౌడ్ జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో అత్యంత కోలాహలంగా, ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన తెదేపా నాయకులు, శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేయించి రాజేంద్ర గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గోవిందు గౌడ్ తో పాటు యువ నాయకుడు రాజేంద్ర గౌడ్ లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు, అభిమానులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా రాజేంద్ర గౌడ్ మండల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిరుపేదలకు సాయం అందించడంతో పాటు, ఆలయాల నిర్మాణాలకు తనవంతు ఆర్థిక సాయం చేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అభిమానుల కోలాహలం, శుభాకాంక్షల నడుమ యువ నాయకుడు ఈ. రాజేంద్ర గౌడ్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ఇంతటి ప్రేమాభిమానాలను కురిపించిన మండల ప్రజలకు, తెదేపా నాయకులకు, శ్రేణులకు మరియు అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. జనసేవలో ఎల్లప్పుడూ ముందుంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఈ బి జి అభిమానులు,ఉలూరు కాడప్ప,జీర వీరేష్, పంపాపతి, దిద్ది వెంకటేష్, ఎర్రి స్వామి, బిజెపి ప్రసాద్, జనసేన అశోక్, దుర్గయ్య, వీరన్న గౌడ్, ముల్లా మోయిన్, అబ్దుల్ రెహ్మాన్, పవన్, బద్రి, వెంకటేష్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్‌కు మురళీకృష్ణం రాజు కృతజ్ఞతలు

**--రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు**



**కాకినాడ జిల్లా ఆగస్టు 20(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.పార్టీ బలోపేతం,భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించినట్లు మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు.

## ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా అసిస్టెంట్ కమిషనర్

**మద్యం అక్రమ విక్రయాలు, అధిక ధరలు, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**





**ఎమ్మిగనూరు, ఆగస్టు 20 (ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు ఎక్సైజ్ స్టేషన్‌ను కర్నూలు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆర్. హనుమంతరావు గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, మద్యం విక్రయాల వివరాలు, లైసెన్స్‌ల గడువు, నమోదైన కేసులు, వాటి పురోగతిని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న లీజ్ ఇయర్ పాలసీ గడువు వచ్చే నెలతో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన మద్యం అమ్మకాలు, లైసెన్స్‌ల వివరాలు, కేసుల పురోగతిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.మద్యం బాటిల్ వివరాలు మొబైల్‌లోనే మద్యం బాటిల్‌పై ఉన్న బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ బాటిల్ ధర, తయారీ వివరాలు తదితర పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం ఉందని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. వినియోగదారులు కూడా మద్యం కొనుగోలు సమయంలో ధర విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మిగనూరు ఎక్సైజ్ పరిధిలో గంజాయి, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహిస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్. హనుమంతరావు హెచ్చరించారు. అలాగే బెల్ట్‌షాపుల నిర్వహణ, మద్యం షాపుల్లో నిర్ణీత ధరలకు మించి విక్రయాలు జరిపే వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వాటిపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ఇన్ఫోసిమెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయరాముడు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగ కాంతులతో మెరిసిపోతున్న గొల్లప్రోలు..
# ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసుల ముందస్తు వ్యూహం!

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పవిత్ర శ్రావణ మాసంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు పట్టణంలో పండుగ సందడి నెలకొంది. (శుక్రవారం) వరలక్ష్మీ వ్రతం కావడంతో, పూజా సామాగ్రి, పండ్లు, పూలు, నూతన వస్త్రాల కొనుగోళ్ల కోసం భక్తులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో గురువారం సాయంత్రం నుంచే గొల్లప్రోలు స్థానిక ప్రధాన రహదారి ప్రజలు, వాహనాలతో అత్యంత రద్దీగా మారింది. పండుగ రద్దీ కారణంగా ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా పోలీసులు అప్రమత్తమయ్యారు. గొల్లప్రోలు సబ్ ఇన్స్పెక్టర్ నౌడు రామకృష్ణ పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. మెయిన్ రోడ్డులో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.ట్రాఫిక్ సమస్య తీవ్రం కాకుండా ఉండేందుకు ఎస్సై నౌడు రామకృష్ణ స్వయంగా రంగంలోకి దిగారు. ఏఎస్ఐ మరియు ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన మెయిన్ రోడ్డులో వాహనాల





రాకపోకలను క్రమబద్ధీకరించారు. రోడ్డుపై ఎవరూ అడ్డదిడ్డంగా వాహనాలు నిలపకుండా, కొనుగోలుదారులు క్రమశిక్షణతో వెళ్లేలా పర్యవేక్షించారు. ముఖ్యంగా వ్యాపారులు తమ దుకాణాల ముందు రహదారిని ఆక్రమించకుండా, వాహనదారులు బండ్లు రోడ్డుమీదకు పెట్టకుండా తగిన సూచనలు చేశారు.సాధారణంగా పండుగ రోజుల్లో ప్రధాన కూడళ్లలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అయితే ఈసారి గొల్లప్రోలు పోలీసులు ముందస్తుగా , గురువారం సాయంత్రం నుంచే గట్టి చర్యలు తీసుకోవడం పట్ల స్థానిక ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పండుగ పూట ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తున్న ఎస్ఐ. నౌడ్ రామకృష్ణను, పోలీస్ సిబ్బందిని స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

# ప్రజా జ్యోతి ఎఫెక్ట్.. కదిలిన యంత్రాంగం

## శిథిలావస్థలో గొల్లప్రోలు పశువైద్యశాలపై అధికారుల పరిశీలన

## నూతన భవనం నిర్మించాలని రైతులు, పశుపోషకుల విజ్ఞప్తి

**కాకినాడ జిల్లా ( గొల్లప్రోలు) (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పట్టణంలోని శిథిలావస్థకు చేరుకున్న పశువైద్యశాల భవనంపై ప్రచురితమైన 'ప్రజా జ్యోతి' కథనానికి స్పందన లభించింది. ప్రమాదకరంగా మారిన భవనంలో సిబ్బంది విధులు నిర్వహించడంతో పాటు పశువులకు వైద్యం చేయించేందుకు వచ్చే రైతులు, పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ నేపథ్యంలో బుధవారం గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడాల సూరిబాబు, జనసేన నాయకుడు బలిరెడ్డి గంగాబాబు నాయకులు తదితరులు పశువైద్యశాలను సందర్శించి భవనం పరిస్థితిని పరిశీలించారు. భవనంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించడంతో పాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, వైద్యం కోసం వచ్చిన రైతులు, పశుపోషకులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.






### ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం

పశువైద్యశాల భవనం చాలాకాలంగా శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం పైకప్పు, గోడలకు సంబంధించిన పెచ్చులు ఊడిపడుతున్నాయని, రోజురోజుకూ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లోనే విధులు నిర్వహించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. పశువులకు వైద్యం చేయించేందుకు వచ్చే రైతులు, పశుపోషకులు సైతం భవనం పరిస్థితిని చూసి భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.

### ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి రాక

గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రతిరోజూ రైతులు తమ పశువులకు వైద్యం చేయించేందుకు ఈ పశువైద్యశాలకు వస్తుంటారు. పాడి పశువులు, వ్యవసాయ అవసరాలకు వినియోగించే పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు ఈ ఆసుపత్రే వారికి ప్రధాన ఆధారంగా ఉంది.అయితే భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్య సేవలు పొందే సమయంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో సేవలు పొందాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కథనంతో అధికారుల దృష్టికి సమస్య

గొల్లప్రోలు పశువైద్యశాల దుస్థితిపై 'ప్రజా జ్యోతి'లో ప్రచురితమైన కథనం సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. భవనం ప్రమాదకర పరిస్థితి, సిబ్బంది ఇబ్బందులు, రైతులు--పశుపోషకుల భద్రతకు పొంచి ఉన్న ముప్పును కథనం ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు పశువైద్యశాలను పరిశీలించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అయితే కేవలం పరిశీలనతో సరిపెట్టకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### కొత్త భవనం నిర్మించాలి

శిథిలావస్థకు చేరుకున్న ప్రస్తుత భవనాన్ని తొలగించి, అదే ప్రదేశంలో లేదా అనువైన ప్రాంతంలో ఆధునిక వసతులతో నూతన పశువైద్యశాల భవనం నిర్మించాలని రైతులు, పశుపోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలతో కొత్త భవనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇందుకు అవసరమైన స్థల పరిశీలన, అంచనాల తయారీ, నిధుల మంజూరు వంటి ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




### పరిశీలనతో ఆగకుండా చర్యలు

పశు వైద్యశాలను అధికారులు పరిశీలించడం తొలి అడుగేనని, ఇకపై తక్షణ రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు నూతన భవన నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రతిరోజూ పశువైద్యశాలకు వచ్చే రైతులు, పశు పోషకులు, సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని, అవసరమైన నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని వారు కోరుతున్నారు. 'ప్రజా జ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు చర్యలు కొనసాగించాలని రైతులు, పశుపోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గొల్లప్రోలు ప్రగతి పథంలో మరో ముందడుగు





**: మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి ఆధ్వర్యంలో దశలవారీగా హైవే వరకు వీధి దీపాల వెలుగులు!**

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పట్టణ రూపురేఖలను మార్చడమే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి అహర్నిశలు శ్రమిస్తున్నారు. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా, గొల్లప్రోలు నుండి పిఠాపురం వెళ్లే ప్రధాన రహదారిని చీకటి నుంచి కాంతివంతంగా మార్చేందుకు ఆమె కంకణం కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో, గురువారం నాడు సదరు మార్గంలో జరుగుతున్న వీధి దీపాల ఏర్పాటు పనులను కమిషనర్ పర్యవేక్షించడం వారి నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. గతంలో ఊరి చివరన ఉన్న ఎస్ఎస్పీఎల్ బాయ్స్ హైస్కూల్ వరకు అత్యంత ఆధునికమైన కొత్త ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసి, దానికి కొనసాగింపుగా, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సరికొత్త వైరింగ్‌తో మరో 7 ఎల్ఈడీ వీధి దీపాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించారు. కమిషనర్ ఎండను సైతం లెక్కచేయకుండా స్వయంగా పనులను పర్యవేక్షించడంతో సిబ్బంది కూడా రెట్టింపు ఉత్సాహంతో పనిచేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దివిజ సంపతి మాట్లాడుతూ.. ప్రజా సౌకర్యార్థం త్వరలోనే ఈ మార్గంలో జాతీయ రహదారి వరకు కొత్త లైట్లు వేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇందుకు తగిన చర్యలు వేగంగా తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, ప్రస్తుతం లైట్లు వేసిన పాయింట్ నుండి హైవే వరకు కొత్తగా విద్యుత్ స్తంభాలు నాటాల్సి ఉందని, అందుకు భారీగా నిధులు అవసరమవుతాయని వివరించారు. ఖర్చు ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, వెనకడుగు వేయకుండా ఈ పనులను దశలవారీగా అత్యంత నాణ్యతతో పూర్తి చేస్తామని ఆమె స్పష్టం చేశారు. కమిషనర్ ఈ దూరదృష్టి , పట్టుదలను స్థానిక ప్రజలు వేనోళ్ల కొనియాడుతున్నారు.పట్టణ వికాసానికి అహర్నిశలు శ్రమిస్తున్న కమిషనర్ ఆలోచనలకు అనుగుణంగా మున్సిపల్ సిబ్బంది కూడా చక్కటి సహకారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ ఎండి ఆలీషా, ఎమినిటీ సెక్రెటరీ ఆర్. వెంకటేష్ , మున్సిపల్ లైటింగ్ సిబ్బంది పాల్గొని, పనులను విజయవంతం చేశారు. కమిషనర్ దివిజ సంపతి నాయకత్వంలో గొల్లప్రోలు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దోమల నివారణపై ప్రజలకు అవగాహన




**నందవరం, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రేవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే నానుడిని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చూడు సిహెచ్ఓ బలరాముడు, సూపర్ వైజర్ శ్రీనివాసులు, మేల్ వర్కర్ శ్రీధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి నాలుగో వార్షికోత్సవ వేడుకలు

-- వార్షికోత్సవం సందర్భంగా భారీ అన్నదానం



**కాకినాడ జిల్లా ఆగస్టు 20(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కిర్లంపూడి మండలం తామరాడ గ్రామంలోని ఏలా నది తీరాన కొలువై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు.వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు,విశేష పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తామరాడ, గోనేడ,రామచంద్రపురం తదితర పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అయ్యప్ప స్వామిని దర్శించుకుని,అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

## డీఎస్సీలో చిన్న తప్పు ఏమిటో ప్రభుత్వం చెప్పాలి! కౌతాళం వైఎస్ఆర్సిపి జనరల్ సెక్రటరీ ఇద్రుస్ భాష,



**కౌతాళం, ఆగష్టు 20 ప్రజా జ్యోతి** కూటమి ప్రభుత్వంలో డీఎస్సీ నియామకాలపై శాసనమండలి సాక్షిగా "చిన్న తప్పు జరిగింది" అని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం నిరుద్యోగ యువతను మరింత ఆందోళనకు గురిచేస్తోందని ఏంటి ఆ చిన్న తప్పు అచ్చెన్నాయుడు గారూ?" అని ఆయన ప్రభుత్వాన్ని వైఎస్ఆర్సీపీ మండల జనరల్ సెక్రెటరీ ఇద్రుస్ బాషా ప్రశ్నించారు.ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ-2025లో క్వశ్చన్ పేపర్ కు సంబంధించిన ఆరోపణలు, స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్లపై వచ్చిన వివాదాలు, అభ్యర్థుల ఎంపిక--వెరిఫికేషన్పై నెలకొన్న అనుమానాలు చిన్న విషయాలుగా ప్రభుత్వం ఎలా పరిగణిస్తుందని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో మొదట నుండి వైసీపీ పోరాటాలు కొనసాగిస్తుంటే, నిజానిజాలు పై విచారణ చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాల్సింది పోయి,వైసీపీ నాయకుల గొంతును నొక్కడానికి ప్రయత్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.సాక్షాత్ కూటమి మంత్రి నే చిన్న తప్పు జరిగింది అని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు ప్రజలు గమనించాలని ఇప్పటికైనా వైసీపీ నిబద్ధత ఏమిటో తెలుసుకోండి

## మంత్రి ఫరూక్ చేతులు మీదుగా కమిన్,డేసన్ సర్టిఫికెట్ అందుకున్న డోన్ ఆర్ఐ,మస్తాన్,



**డోన్ (ప్రజా జ్యోతి) ఆగస్టు20** నంద్యాల జిల్లా డోన్,మండల రెవెన్యూలో పనిచేస్తున్న ఆర్ఐ మస్తాన్ కు 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సేవలను గుర్తించి, కలెక్టర్ రాజకుమారి, డోన్ ఆర్డీవో నరసింహులు, ఆధ్వర్యంలోమంత్రి ఎన్ ఎం ఎం ఫరూక్, చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారు, విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజ్ గౌడ్ ఈ సందర్భంగా పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల జిల్లాకి ఆదర్శంగా డోన్ మండలంలో గ్రామీణ ప్రాంతము పట్టణ ప్రాంతం ప్రజలకు ఉత్తమ సేవలు అందించినందుఉత్తమ ఉద్యోగి పురస్కారము అవార్డును కలెక్టర్ రాజకుమారి ,డోన్ ఆర్డిఓ నరసింహులు, ఎండిఓ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఫరుక్ చేతులు మీదుగా అందుకున్నందుకు మా కమిటీ తరపున డోన్ ఆర్ఐ నీ ఘనంగా సన్మానించి, పుష్పగుచ్చము, ఆధ్యాత్మిక పుస్తకములను, అందజేయడం జరిగినదని ఏఈ నాగరాజు తెలిపారు డోన్ మండల వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షులు గోసానిపల్లెజగదేవి, తెలుగు రాంబాబు, డోన్ మండల దళిత సంక్షేమ సంఘం నాయకులు చిన్న మల్కాపురం గార్లపాటి నాగన్న, డోన్ మండల డిప్యూటీ తాసిల్దార్ మహేశ్వర్ రెడ్డి వీఆర్వో మహానంది వీఆర్వో స్వామి, విఆర్వో తిమ్మప్ప, యాపదిన్య కురువ శ్రీనివాసులు, వినియోగదారుల సంఘం నాయకులు ఏసు పాదం ఆల శ్రీరాములు కాల్వ ఓం నారాయణ సోషల్ వర్కర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు,

# సూర్యుడు చెరువు ఆక్రమణదారులకు చుక్కెదురు





**: రంగంలోకి దిగిన కమిషనర్**

**సూర్యుడు చెరువు సర్వేకు కమిషనర్ గ్రీన్ సిగ్నల్ త్వరలో సర్వే చేస్తామని వెల్లడి!**

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు పట్టణ పరిధిలో గల సూర్యుడు మంచినీటి చెరువు ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదుపై కమిషనర్ దివిజా సంపతి స్పందించారు. గురువారం ఆమె సూర్యుడు చెరువును సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న చెరువు విస్తీర్ణం,ప్రస్తుతం ఉన్న చెరువు పరిస్థితిని కమిషనర్ నిశితంగా పరిశీలన జరిపారు. చెరువు సమీపంలో ఉన్న సినిమా థియేటర్ ను,పరిసర ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ ఫిర్యాదుదారుడు నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు 13 ఎకరాలకు పైగా ఉండాల్సిన సూర్యుడు చెరువు గర్భాన్ని సమీపంలో ఉన్న ఒక సినిమా థియేటర్ యాజమాన్యంతో పాటు మరికొందరు కలిసి 4 ఎకరాలకు పైగా ఆక్రమించారని గొల్లప్రోలుకు చెందిన ఉలవశెట్టి శ్రీను గత సోమవారం పిఠాపురంలోని 'పాడ' కార్యాలయంలో పిడికి ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా చెరువు గట్టుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, థియేటర్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనివల్ల ఆ రహదారి గుండా ప్రయాణించే బాటసారులకు ప్రమాదం పొంచి ఉందని,ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని కోరారు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందించిన కమిషనర్ దివిజా సంపతి చెరువు వద్దకు చేరుకుని పరిశీలన జరిపారు. ఫిర్యాదుదారుడి నుంచి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు గర్భాన్ని మొత్తం నిష్పక్షపాతంగా సర్వే చేయించి తక్షణం ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ ను శ్రీను కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలను గుర్తించినట్లయితే నివేదిక ఇవ్వాలని తహసిల్దార్ కార్యాలయానికి ఆదేశాలు పంపినట్లు తెలిపారు. సూర్యుడు చెరువును త్వరలో సర్వే చేయడం జరుగుతుందని,సర్వేలో ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే ఎంతటి వారివైనా సరే ఆక్రమణలను కచ్చితంగా తొలగించడం జరుగుతుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఫిర్యాదుదారుడు శ్రీను పాల్గొన్నారు.

## మైలవరం నియోజకవర్గం అభివృద్ధి పదంలో నడిపించడంలో, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంలో రేసుగుర్రంలా దూసుకుపోతున్న ఎమ్మెల్యే వసంత....!!



**జి.కొండూరు :( ఆగస్టు 20,ప్రజా జ్యోతి బ్యూరో భట్టిప్రోలు నాగేశ్వరరావు):** మైలవరం నియోజవర్గాన్ని అభివృద్ధి చేయడంలో నూ....అలాగే నియోజకవర్గ ప్రజలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడంలోను శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ త్రికరణ శుద్ధిగా పాలన చేస్తున్నారనడంలో అతియో శక్తి కాదు..!వసంత కృష్ణ ప్రసాద్ డబ్బులు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదు. రాజకీయాల్లో కి రాకముందే ధనవంతులు.... సమాజంలో వ్యాపారవేత్తగా... పారిశ్రామవేత్త గా పేరు గడించారు. తన తండ్రి వసంత నాగేశ్వరరావు వారసత్వంగా ప్రజలకు ఏదో చేయాలని తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారు. గతంలో రెండుసార్లు నందిగామ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిరుత్సాహపడకుండా,పట్టుదలతో ప్రజా సేవ చేయాలనే తలంపుతో....2019 సంవత్సరంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మైలవరం నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలుపొందారు. ఆయన గెలుపే ఆ పార్టీలోని కొందరికి మింగుడు పడలేదు. గతంలో మైలవరం నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి చెందిన ఆ నాయకుడు వసంత పై చాడీలు చెబుతూ.... అసత్య ప్రచారాలు చేస్తూ,మైలవరం నియోజకవర్గానికి నిధులు రానీయకుండా,అడ్డ పుల్లలు వేస్తూ... అడ్డుకున్నాడు. దీంతో మనస్థాపానికి గురైన వసంత ప్రజలకు సేవ చేయాలని తలంపుతో...తెలుగుదేశం పార్టీలోకి చేరి 2024 సంవత్సరంలో మైలవరం నియోజవర్గం నుండి పోటీ చేసి 43 వేల మెజార్టీతో రెండోసారి గెలుపొందారు. వసంత గెలుపొందిన ఎలాంటి గర్వం లేకుండా,అందరినీ కలుపుకొని పోతూ...నీతి -నిజాయితీతో పాలన చేస్తుంటే... ఓర్వలేక కొందరు నాయకులు వసంతను మట్టి మాఫియా, ఇసుక మాఫియా,బూడిద మాఫియా అంటూ....గతంలో వాళ్ళు చేసిన అవినీతి మరకలను వసంత పై వేయాలని తలంపుతో ఇష్ట రాజ్యాంగ వసంతపై తప్పుడు ప్రచారాలు చేశారు. ఈరోజు వసంతపై తప్పుడు ప్రచారాలు చేసిన నాయకులు ఒకరు రాజకీయ సన్యాసం తీసుకుంటే.... మరొక నాయకుడు కుటుంబ తగాదాలతో,మద్యం కేసులతో చెరసాల చుట్టూ తిరుగుతూ...రాజకీయంగా భ్రష్టు పట్టాడని చెప్పవచ్చు. చెడపకురా.....చెడేదవు...!అన్న సామెత లాగా,నేడు రాజకీయంగా వాళ్ళే చెడిపోయారు. కానీ నీతి -నిజాయితీతో పాలన చేస్తున్న వసంత మాత్రం మైలవరం నియోజవర్గంలో అందరివాడిగా పేరు గడించారు. అందుకే మైలవరం నియోజవర్గ ప్రజలు వసంతకు 2019 సంవత్సరంలో పట్టం కట్టారు. అలాగే 2024 సంవత్సరం రెండవసారి పట్టం కట్టారు. అలాగే 2029 సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో కూడా మూడోసారి వసంతకు పట్టం కట్టి,వసంత హ్యాట్రిక్ సాధించేటందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పటంలో అతియో శక్తి కాదు. ఎందుకంటే శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఇప్పటికే నూతనంగా రహదారులు నిర్మాణాలు చేయించడమే కాకుండా,వంతెనలు, చప్టలు నిర్మిస్తున్నారు. అలాగే నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఔట్సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తూ, డ్వాక్రా మహిళలకు సకాలంలో రుణాలు ఇప్పిస్తూ....ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ప్రతినెల 4 వేలు నుండి 15వేల వరకు అర్హులకు ఇప్పిస్తూ,తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి 15 వేలు పంపిణీ చేస్తూ, ఆటో డ్రైవర్లకు ప్రతి సంవత్సరం 15 వేలు ఇప్పిస్తూ, మత్స్యకారులు ప్రతి సంవత్సరం 20 వేలు ఇస్తూ,అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి 20 వేలు పంపిణీ జరుపుతూ, ఇలా అనేక ప్రభుత్వ సంక్షేమ విజయాలను నియోజవర్గ ప్రజలకు అందిస్తూ.... నియోజవర్గ అభివృద్ధి తన ధ్యేయంగా వసంత పాలన చేస్తూ, మైలవరం నియోజకవర్గం ను,సమగ్ర అభివృద్ధి చేసేటందుకు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ రేసుగుర్రంలా పరిగెడుతున్నారని చెప్పడంలో అతియో శక్తి కాదు. ఏది-ఏమైనా, ఎవరు ఎన్ని అవాకులు...చవాకులు పేల్చిన వసంత నీతి -నిజాయితీ కలిగిన పవర్ ఫుల్ లీడర్ అని మైలవరం నియోజకవర్గ ప్రజలు చెబుతుండటం విశేషం...!!

# ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




**రామాపురం ఆగస్టు 20 ప్రజా జ్యోతి** 20 వతేదీన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డా,, వినోదకుమార్ మరియు లక్కిరెడ్డిపల్లి సబ్ యూనిట్ అధికారి జయరామయ్య గ ఆధ్వర్యంలో గువ్వలచెరువు యం పి పి స్కూల్ మరియు జిల్లా పరిషేత్ స్కూల్ పిల్లలు కు జాతీయ దోమల దినోత్సవశీ గురించి దోమలు పుట్టకూడదు-దోమలు కుట్టకూడదు, దోమతెరలు వాడండి- ఆరోగ్యంగా జీవించండి, జ్వరమా-మలేరియా కావచ్చు, 2రోజులకు మించిజ్వరం వుంటే రక్తపరీక్ష చేయించుకోండి, ప్రతీ శుక్రవారం డ్రైడే గా పాటించండి అని నినాదాలు చేస్తూ స్థానిక వీధుల్లో ర్యాలీ నిర్వహించడం జరిగింది. దగ్గర వున్నస్కూల్ నందు మానవహారంగా నిలబడి ఆరోగ్య సిబ్బంది మరియు ప్రజల ద్వారా ప్రభుత్వం పంపిన సందేశమును ప్రతిజ్ఞ చేయడం జరిగింది. అలాగే ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, బోధకాలు వ్యాధి, మెదడువాపు వ్యాధి మొదలగు వ్యాధుల లక్షణాలు గురించి, వాటి నివారణ చర్యలు గురించి మరియు ఫ్రైడే-డ్రైడే గురించి ప్రజలలో అవగాహన కల్పించడం జరిగింది. ఇళ్లలో ప్రధాన ద్వారమునకు మరియు కిటికీలకు మెస్ బిగించుకోవాలని, అలాగే రాత్రులు నిద్రించే సమయంలో దోమతెరలు కట్టుకోవాలని అవగాహన కల్పించడం జరిగింది. ఎవరికైనా జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రమునకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలి అని వివరించాము. ఈ కార్యక్రమంలో ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి. రేఖా నాయక్ యం ల్ హెచ్ పి ఇందిరాజా.బహుళార్థ ఆరోగ్య కార్యకర్తలు. క్రిస్టాఫర్ ప్రమీల ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొనడం జరిగినది..

## సైబర్ నేరాల పట్ల అప్రమతంగా ఉండాలి

## సీఐ బాల సురేష్




**వేలేరుపాడు :20 ఆగస్ట్ వేలేరుపాడు : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** ప్రస్తుతం సమాజం లో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని కుక్కునూరు సీఐ బాల సురేష్ అన్నారు. ఓటీపీ లను పంచుకోవడం, వాట్సాప్ లింక్ లను ఓపెన్ చేయడం లాంటివి చేయకూడదన్నారు, అలాగే సైబర్ నేరగాళ్ల వలలో పడి నగదు పోగొట్టుకున్న వెంటనే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు, ఎంత త్వరగా స్పందిస్తే అంత త్వరగా పోయిన నగదు వెనక్కి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు, వేలేరుపాడు నాలుగు రోడ్ల కూడలి వద్ద మహిళల భద్రత, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణ, చైల్డ్ హెల్ప్ లైన్,ఈగల్ హెల్ప్ లైన్,పోలీస్ ఎమర్జెన్సీ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వేలేరుపాడులో కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని రెండు చోట్ల నిఘా నేత్రా (సి సి కెమెరా ) లను స్థానిక వర్తక వ్యాపారుల సహకారంతో అమర్చారు. కార్యక్రమంలో ఎస్ఐ పి,నవీన్ కుమార్, స్థానిక ప్రజలు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఫిజికల్ డైరెక్టర్ మనోజ్ మృతికి ప్రగాఢ సంతాపం

**గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ సూర్య నాయక్**




**కంబదూరు ఆగస్టు 20:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు:** సేవాగఢ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మనోజ్ అకాల మృతికి గిరిజన సంక్షేమ సంఘం రాయలసీమ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ సూర్య నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి ఎంతో బాధాకరమని, చిన్న వయసులోనే ఉద్యోగంలో చేరి కొద్ది రోజులకే ఇలా మృత్యువాత పడటం జీర్ణించుకోలేని విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. మనోజ్ మృతి ఊహించని విషాదమని, ఇలాంటి ఘటన ఎవరికీ జరగకూడదని సూర్య నాయక్ అన్నారు. విధుల్లో చేరిన కొద్దికాలంలోనే విద్యార్థులకు తనదైన శైలిలో శిక్షణ అందిస్తూ, వారి క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు.

**విద్యార్థుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం**

సేవాగఢ్ గిరిజన గురుకుల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన మనోజ్ ఎంతోమంది గిరిజన విద్యార్థులను వివిధ క్రీడల్లో ప్రోత్సహించారని సూర్య నాయక్ తెలిపారు. ఆయన శిక్షణ, మార్గదర్శకత్వంతో పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వివిధ క్రీడలకు ఎంపికై గురుకుల పాఠశాలకు, తమ కుటుంబాలకు గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించడం ద్వారా క్రీడల్లో ముందుకు తీసుకెళ్లేందుకు మనోజ్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన అకాల మరణం విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు, గిరిజన సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

**కుటుంబానికి ప్రభుత్వ అండ అవసరం**

చిన్న వయసులోనే కుటుంబాన్ని, ఉద్యోగాన్ని వదిలి వెళ్లాల్సి రావడం అత్యంత విషాదకరమని సూర్య నాయక్ అన్నారు. మనోజ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ముఖ్యంగా బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మనోజ్ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, ఆ కుటుంబంపై ఎల్లప్పుడూ భగవంతుని కృప ఉండాలని సూర్య నాయక్ ప్రార్థించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్లో అవగాహన కార్యక్రమం






**తాళ్లపూడి, ఆగస్టు 20, ప్రజాజ్యోతి న్యూస్** మాదక ద్రవ్యాలను వదిలివేసి, శాంతియుత జీవనం గడపాలని బ్రహ్మకుమారీస్ మెడికల్ విభాగం పిలుపునిచ్చింది. బ్రహ్మకుమారీస్ మెడికల్ విభాగం ఆదేశాల మేరకు తాళ్లపూడిలోని శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ పోలవరం శాఖ ప్రతినిధి బీకే రామలక్ష్మి ఆధ్వర్యంలో హాస్పిటల్ స్టాఫ్ సుమారు 65 మందితో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారికి ప్రశంసా పత్రాలు (సర్టిఫికెట్లు) ప్రధానం చేశారు. ఈ సందర్భంగా బీకే రామలక్ష్మి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజం మూడు దెబ్బతింటాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండి, మానసిక ప్రశాంతతతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి స్ఫూర్తి హాస్పిటల్ సీఈవో గూడా విజయ్ రాజు, మేనేజింగ్ పార్టనర్ లింగంపల్లి సుధీర్ కుమార్, బ్రహ్మకుమారిస్ ప్రతినిధులు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీస్ స్టెప్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో




**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 20 ప్రజా జ్యోతి** ఉమ్మడి కడప అన్నమయ్య సీఈవో బివి ప్రసాద్ రావు మేనేజర్ సుబ్బరాయుడు అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ వెంకటనారాయణ లక్కిరెడ్డిపల్లి మండలం అన్నమయ్య జిల్లా పర్వత రెడ్డి గారి పల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులు యొక్క ఆలోచనలు అంకితభావం ఏకాగ్రత తల్లిదండ్రులను గౌరవించడం ఉపాధ్యాయులను గౌరవించడం అలాగే చదువుతో పాటు సంస్కారాన్ని కూడా అలవర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా మంచి గుర్తింపు ఉంటుందని అలాగే సిఐ కృష్ణంరాజు నాయక్ మాట్లాడుతూ అమ్మాయిలు యూ టీజింగ్కి గురవుతున్న ఇబ్బంది పెడుతున్న యువకులు విద్యార్థులు ఎవరైనా సరే శిక్షకు అర్హులవుతారని వాళ్ళ జీవితాలు జైలు జీవితాలు అవుతాయని, మత్తు పదార్థాలు వాడకం మరియు వాటి రవాణాను నివారించాలని అట్లు సహకరిస్తే మీ జీవితం విద్యార్థుల జీవితం అదొకటి పాలవుతుందని తెలియజేశారు. ఎస్సై గోల్కొండ శోభ మాట్లాడుతూ బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఇలాంటి అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని చదువు సంస్కారం వీటితో మానవత్వంతో కూడిన విలువలు మీ విద్యార్థి జీవితం నుంచి ఉన్నత స్థానానికి నెలకొల్పుతాయని తెలియజేశారు. కెరీర్ గైడెన్స్ మోటివేషనల్ స్పీకర్ రిసోర్స్ పర్సన్ కొలిమి పకీరయ్య విద్యార్థులను ఎంతగానో వారి జీవిత పాఠాలను చదువుతోపాటు అన్ని నీ ఆలోచన తత్వాన్ని మీ శక్తి సామర్థ్యాలను ఎప్పుడూ మరవకూడదని కన్న తల్లిదండ్రులకు చదువు నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని అలాగే నీ నువ్వే కాబట్టి బంగారు జీవితాన్ని వైపు మీ పద్ధతులు మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, టీచర్లు బండపల్లి శ్రీనివాసులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు

# నిబంధనలకు విరుద్ధంగా దాబా నిర్వహణపై ఆరోపణలు కోకొల్లలు

## అన్నవరం శివారులో రా.....డు దాబాలో కల్తీ ఆహారం.. అపరిశుభ్ర వాతావరణం!

### కల్తీపై నిరంతర నిఘా ఏది..? ప్రజల ఆరోగ్య భద్రత ఎక్కడ..?



**శంఖవరం: ఆగస్టు 20, (ప్రజా జ్యోతి న్యూస్)** రుచికరమైన ఆహారాన్ని ఆస్వాదించేందుకు భోజన ప్రియులు సమీపంలోని దాబాలను ఆశ్రయిస్తుంటారు. అయితే కొందరు దాబా నిర్వాహకులు నిబంధనలను పాటించకుండా, ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అన్నవరం గ్రామ శివారులోని రా.....డు దాబా విషయంలోనూ ఇటువంటి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆహార పదార్థాలకు అధిక రుచి, ఆకర్షణ కోసం రసాయనిక రంగులు, నాణ్యత లేని పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల నుంచి వస్తున్నాయి. అలాగే దాబా పరిసరాల్లో పరిశుభ్రత ప్రమాణాలు సరిగా పాటించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.ఒక దాబా నిర్వహణకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, నిబంధనల పాటింపు ఉండాల్సి ఉండగా, సదరు దాబాకు అన్ని అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం నిర్వహణ జరుగుతోందా? అనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆహార భద్రత, పరిశుభ్రత, అగ్నిమాపక భద్రత, కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. అదేవిధంగా కల్తీ నూనె, నాణ్యత లేని ఆహార పదార్థాలు, సరిగా నిల్వ చేయని మాంస పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి, ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, నిబంధనల ఉల్లంఘన ఏమైనా ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం అందేలా అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్వర్గీయ కారం అరుణ్ కుమార్,విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారు!..

### సి.పి.ఎం,పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు!..



**వి.ఆర్.పురం,ఆగస్టు 20(ప్రజాజ్యోతి ప్రతినిధి)**కారం అరుణ్ కుమార్,ఎస్.ఫ్.ఐ, నాయకులుగా ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులకు,స్ఫూర్తి సందేశం ఇచ్చారని, విద్యారంగంలో అనేక సమస్యలు పరిష్కరించాలని పోరాటంచేశారని, ఆయనసేవలు మరువ లేనివని, సి.పి.ఎం, పార్టీ జిల్లా నాయకులు సున్నం రాజులు, స్పష్టం చేశారు. గురువారం,? మండలంలోని చిన్నమట్ట పల్లి, పంచాయతీ, చిన్న మట్టపల్లి,గ్రామంలో స్వర్గీయ ఎస్.ఎఫ్.ఐ నాయకుడు కారం అరుణ్ కుమార్,వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సి.పి.ఎం,పార్టీ, సీనియర్ నాయకులు, మాజీ,ఎం.పి.పి, కారం సిరమయ్య (స్వర్గీయ) కుమారుడైన అరుణ్ కుమార్, చిత్రపటానికి సి.పి.ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు, పూలమాల వేసి ఘనంగానివాళులర్పించారు.?ఈసందర్భంగా సున్నం రాజులు, మాట్లాడుతూ అరుణ్ కుమార్ ఎస్.ఎఫ్.ఐ,లో చురుగ్గా పని చేస్తూ, విద్యార్థుల హక్కులు మరియు సమస్యలపరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేశారని గుర్తు చేసుకున్నారు. అంకిత భావంతో పనిచేసే అలాంటిమంచి నాయకుడిని కోల్పోవడం తీరని లోటని తీవ్రవిచారాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థిలోకం కోసం ఆయన చేసినసేవలు,పోరాటాలు ఎంతో మందికి స్ఫూర్తి దాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఎం.పీ.పీ కారం లక్ష్మి,ఎం.పీ.టీ.సీ, పూనెం ప్రదీప్ కుమార్,సి.పి.ఎం,పార్టీ జిల్లా నాయకులు సోయం చిన్నబాబు,మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్,మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సోడి మల్లయ్య, సిరపు తాతబాబు రెడ్డి, పండ వెంకటేశ్వర్లు, గొర్రె వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు (తల్లి) కారం ముత్తమ్మ, పలువురు ప్రజా సంఘాల నేతలు,స్థానిక నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొని అరుణ్ కుమార్, స్మృత్యర్థం నివాళులు అర్పించారు.

# వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఐడీ కార్డుల వెరిఫికేషన్

## ఎటపాకలో కొనసాగిన కార్యకర్తల రిజిస్ట్రేషన్ కార్యక్రమం





**ఎటపాక, ఆగస్టు 20 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలంలోని గుండాల గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఐడీ కార్డుల వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి నివాసం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎటపాక మండల కమిటీ నాయకులు పాల్గొని కార్యకర్తల వివరాలను పరిశీలించి నమోదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తల గుర్తింపు కార్డులకు సంబంధించిన వివరాలను సేకరించి, నమోదు ప్రక్రియను చేపట్టారు. పార్టీ కార్యకలాపాలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తల వివరాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు (బుజ్జి), గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గుడిమల్ల నాగలక్ష్మి, యువజన విభాగం మండల అధ్యక్షుడు తోట శశికుమార్, పురుషోత్త పట్నం గ్రామ కమిటీ అధ్యక్షుడు సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కన్నాయిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్ల మణి, మండల మహిళా కార్యదర్శి ముక్కు కల్పన, మండల ప్రచార విభాగం అధ్యక్షుడు ముత్తిబోయిన రాము, గుండాల గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకాని సురేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, రాయన్నపేట సర్పంచ్ బొర్రా రాంబాబు, మండల మేధావుల విభాగం అధ్యక్షుడు కురినాల విజయ్‌కుమార్, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు మైసాక్షి రాకేష్, గుండాల గ్రామ సామాజిక మాధ్యమాల విభాగం అధ్యక్షుడు నెర్రిబోయిన సందీప్, కొత్తపల్లి సతీష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఐడీ కార్డుల వెరిఫికేషన్, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు.

# గండి పోచమ్మ అమ్మవారికి 5 కిలోల వెండి విరాళం

### .సిరిపురపు కనకమ్మ జ్ఞాపకార్థం బహుకరణ

**తాళ్లపూడి, ఆగస్టు 20, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు మండలం కుమారదేవం గట్టుపై కొలువై ఉన్న మాతృ శ్రీ గండి పోచమ్మ అమ్మవారికి సిరిపురపు కుటుంబం భారీ విరాళం అందజేసింది. అమ్మవారికి వెండి కవచం చేయించేందుకు సుమారు ఐదు కిలోల వెండిని ఆలయానికి సమర్పించింది.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శిరిపురపు మదన మోహన్ రెడ్డి మాట్లాడుతూ, తన తల్లి దివంగత సిరిపురపు కనకమ్మ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తమ తల్లి జ్ఞాపకార్థం సీఈవో ఆఫ్ (ఏఎన్ఐటిఎస్)మెడికల్ కాలేజ్ డాక్టర్ సిరిపురపు చంద్రశేఖర్ రెడ్డి, సుజాత, సిరిపురపు మదన మోహన్ రెడ్డి, సుజన కలిసి ఈ వెండిని ఆలయానికి సమర్పించినట్లు వెల్లడించారు.ఈ వెండి కవచాన్ని త్వరలో తయారు చేయించి, రాబోయే దసరా శరన్నవరాత్రుల సమయానికి అమ్మవారికి అలంకరించేలా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుంకవల్లి వెంకట పోశారావు, ఆలయ ఈవో వెంకటలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన సిరిపురపు కుటుంబాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు



## కీసరలో టిఫిన్ సెంటర్లో అగ్ని ప్రమాదం

**మేడ్చల్ :** కీసర గ్రామంలో టిఫిన్ సెంటర్లో సిలిండర్ లీకేజీతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఉదయాన్నే టిఫిన్ తయారీ కోసమై సిలిండర్ వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి అక్కడున్న వారు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీ శారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. . ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం...

**తుగ్గలి:** భారత ఎన్నికల సంఘం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నందు అభ్యంతరాల సవరణ కొరకు ప్రత్యేక క్యాంపెయిన్లను నిర్వహిస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.గురువారం రోజున విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లైయిములు మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని ఆయన తెలియజేశారు.ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించేందుకు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విస్తృతంగా నిర్వహించేందుకు ఆగస్టు నెల 22,23,29 మరియు 30 తేదీలలో కర్నూలు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించబడుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమం నందు సంబంధిత బూత్ లెవల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉండి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తారని,ఫారం-6 అర్హత కలిగిన కొత్త ఓటర్ల నమోదు చేస్తారని, ఫారం-7 ద్వారా మరణించిన వారు, ఇతర ప్రదేశాలకు తరలి వెళ్లిన వారి పేర్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని,ఫారం-8 ద్వారా పేరు, వయస్సు,చిరునామా వంటి వివరాలలో దిద్దుబాట్లు నిర్వహిస్తారని,ఫారం-8ఏ ద్వారా ఒకే నియోజకవర్గంలోపు చిరునామా మార్పులను అధికారులు నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు.కావున కర్నూలు జిల్లా ప్రజలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ ప్రత్యేక క్యాంపెయిన్ తేదీలను సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చేసుకోవాలని తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.

## దళితవాడ స్మశాన సమస్యను పరిష్కరించండి

**వారం రోజుల్లోపు పరిష్కరించకపోతే రోడ్లను దిగ్బందిస్తాం**

**సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎండి ఆనంద్ బాబు.**

**తుగ్గలి:** తుగ్గలి మండల కేంద్రంలో ఉన్న దళితవాడ స్మశాన సమస్యను పరిష్కరించి, మండల వ్యాప్తంగా గుంతలు పడిన రోడ్లను వారంలోపు మరమ్మతులు చేయకపోతే రోడ్లను దిగ్బందిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం డి ఆనంద్ బాబు హెచ్చరించారు.గురువారం తుగ్గలి మండల కేంద్రంలోని రామాలయం కమ్యూనిటీ హాల్లో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం సిపిఎం మండల నాయకులు రంగస్వామి అధ్యక్షతన నిర్వహించారు.అనంతరం సిపిఎం మండల కమిటి బృందం రాతన మరియు తుగ్గలి మండల కేంద్రంలో గుంతలు పడ్డ రోడ్లను, తుగ్గలి దళితవాడ స్మశాన స్థలాన్ని పరిశీలించి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు యం.డి ఆనంద్ బాబు, మండల కార్యదర్శి శ్రీ రాములు, మండల నాయకులు రంగస్వామి మాట్లాడుతూ గ్రామాల మధ్యనే రోడ్లపై గుంతలు ఏర్పడి గ్రామ ప్రజలతో పాటు వాహనదారులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏలిన వారికి మాత్రం ఏమాత్రం పట్టడం లేదని వారు విమర్శించారు.పత్తికొండ నుండి గుత్తికి వెళ్లే ప్రధానమైన రహదారిలో రాతన గ్రామంలో 20 మీటర్ల పరిధిలో గుంతపడి అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.తుగ్గలి ప్రారంభంలోనూ, రైల్వే బ్రిడ్జి కింద గుంతల మయంగా ఉన్న గుర్తించడం లేదన్నారు,గత సంవత్సర కాలంగా రాతన తుగ్గలి ఎర్రగుడి జొన్నగిరి గ్రామాలలో రోడ్ల మరమ్మతులు నిర్వహించాలని ఆందోళనలు నిర్వహించి వినతి పత్రాలు ఇచ్చినా వినే వారే కరువయ్యారన్నారు.వారం రోజుల్లోపు ఈ రోడ్లు మరమ్మత్తులు చేయకపోతే రోడ్లను దిగ్బందించి నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు. అలాగే తుగ్గలి మండల కేంద్రంలోని దళితవాడ స్మశాన వాటికకు వెళ్లాలంటే దళితపేట నుండి ఒకసారి వాగు దాటి బండి రస్తాలో వెళ్లి తిరిగి స్మశానం దగ్గరికి వెళ్లిన తర్వాత ఆ వాగును తిరిగి దాటాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు.వాగులు దాటేందుకు బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్నిసార్లు మొత్తుకున్నా కనికరించకపోవడంతో దళితులే చందాలు వేసుకొని స్మశానం దగ్గర చిన్నపాటి బ్రిడ్జిని ఏర్పాటు చేసుకున్నారన్నారు.అయినా స్మశానంలోకి వాగు నీళ్లు వచ్చి గుట్టలు సైతం కొట్టుకుని పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.దళితపేట వద్ద బ్రిడ్జి నిర్మించడంతోపాటు స్మశానంలో మట్టితోలి గుట్టలు,అందులోని శవాలు కొట్టుకొని పోకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగాధర్, ప్రసాద్,శికామణి,కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలించిన జనసేన తెర్నేకల్ వెంకప్ప

**దేవనకొండ :** ఆలూరు నియోజకవర్గంలోని పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన వసతులు, బియ్యం నాణ్యతను జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెర్నేకల్ వెంకప్ప పరిశీలించారు.గత వారం తెర్నేకల్ జెడ్పీ హైస్కూల్ ను, నిన్న దేవనకొండ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇటీవల సరఫరా అవుతున్న బియ్యం నాణ్యత గతంతో పోలిస్తే ఆశించిన స్థాయిలో లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది ఒక్క తెర్నేకల్ పాఠశాలకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని, ఇతర పాఠశాలల్లో కూడా బియ్యం సరఫరా నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.బియ్యం గోదాం నుంచి పాఠశాలలకు చేరే వరకు సరఫరా వ్యవస్థలోని ప్రతి దశలో నాణ్యతను అధికారులు తనిఖీ చేసి, సమస్యకు మూల కారణాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ ని కోరారు.విద్యార్థుల ఆరోగ్యం, వారికి అందుతున్న ఆహారం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని తెర్నేకల్ వెంకప్ప స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అరవింద్, నందు, చంటి,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


## భూగర్భ జలాలు ఎండిపోతున్నాయి ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి. బెళగల్ కోడుమూరు నియోజకవర్గంలో భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని త్రాగునీటికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు..ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి అన్నారు.శాసనసభసమావేశాల్లో భాగంగా ఆయన నియోజకవర్గంలోని నీటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలకు తాగు నీరు లభించక ఇబ్బందులు పడుతున్నారని,అలాగే వేసిన పంటలను కూడా రైతులు తొలగించాల్సి వస్తోందని, అసెంబ్లీలో సభ స్పీకర్ దృష్టికి తెచ్చారు.కోడుమూరు నియోజకవర్గానికి సాగు, తాగు నీరందించే కేసీ కెనాల్,గాజులదిన్నె ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటి వాటా ఆధారంగా కర్నూలు, కోడుమూరు,కల్లూరు మండలాలలోని గ్రామాలకు సక్రమంగా తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## నిల్వ కోసం ఫారం పాండ్...

**పాల్వంచ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారంకాలనీ , తొగ్గూడం గ్రామపంచాయతీ పరిధిలోని రైతు బానోత్ బద్రు పొలంలో 20x 20 మీటర్ల విస్తీర్ణంలో, 3 మీటర్ల లోతుతో ఫారం పాండ్ నిర్మాణాన్ని గురువారం ఎంపీడీవో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ, ఫారం పాండ్‌లో నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు చేపల పెంపకానికి కూడా అనుకూలంగా ఉంటుందని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు , వి బి జి రామ్, సిబ్బంది, గ్రామ సర్పంచ్ తేజావత్ వినోద్ కుమార్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.ఫారం పాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎంపీడీవో పి. రాజారావు పాల్వంచ మండలంలోని తొగూడెం, జగన్నాధపురం, కారెగట్టు సత్యనారాయణపురం, మందారికలపాడు, లక్ష్మీదేవిపల్లి-జ, ఉలవనూరు, రేగులగూడెం, చంద్రలగూడెం మరియు మల్లారం గ్రామపంచాయతీలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్ల ఎల్1, హాట్ హౌసెస్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వివరాలను వెరిఫికేషన్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరు: రాజ్‌పాల్ యాదవ్




ప్రముఖ బాలీవుడ్ హాస్యనటుడు రాజ్‌పాల్ యాదవ్ గత కొంతకాలంగా చెక్ బౌన్స్ కేసుల వివాదంలో చిక్కుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శలు, ఆర్థిక ఇబ్బందులు మరియు న్యాయపరమైన వివాదాలపై ఆయన స్పందించారు. సినిమా పట్ల తనకు ఉన్న అనుబంధాన్ని, అంకితభావాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బుతో కొలవలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డబ్బుతో నన్ను ఎవరూ కొనలేరంటూ తేల్చిచెప్పారు. 2013 నుంచి 2016 మధ్య కాలంలో తలెత్తిన సంక్షోభం వల్ల తాను కోట్లల్లో నష్టాన్ని చవిచూశానని ఆయన తెలిపారు. ఈ చట్టపరమైన చిక్కుల కారణంగా తన వృత్తిపరమైన ప్రయాణానికి తీవ్ర విఘాతం కలిగిందని, విదేశాల్లో జరగాల్సిన కనీసం 50కి పైగా పర్యటనలు, టూర్లను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అనివార్య పరిస్థితుల వల్ల తన పారితోషికాన్ని కూడా తగ్గించుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డబ్బు కంటే కళే తనకు ముఖ్యమని చెబుతూ.. తాను కేవలం సినిమా విద్యార్థినని, నటనలో పరిపూర్ణత సాధించడమే తన లక్ష్యమని రాజ్‌పాల్ యాదవ్ అన్నారు. ఎన్ని కష్టాలు, సవాళ్లు ఎదురైనా ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మారలేదన్నారు. విమానాశ్రయాల్లో ప్రతిసారీ వందలాది మంది అభిమానులు వచ్చి తనతో సెల్ఫీలు దిగడమే ప్రజల నుంచి తనకు లభిస్తున్న నిజమైన ఆదరణకు నిదర్శనమని ఆయన తెలిపారు. గతంలో నటుడు రాజ్‌పాల్ యాదవ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అటా పటా లపట్టా' (ఙ్ఖు ్ఖ్ఖు ్ఖుజూఖ్ఖు) సినిమా ఆయన కెరీర్‌లో ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ చిత్రం కోసం ఆయన పెద్దఎత్తున అప్పులు చేసి భారీ వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. అయితే బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆయన తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలోనే తలెత్తిన లావాదేవీల వివాదాలు కోర్టుల వరకు వెళ్లాయి. ఈ విఫల ప్రయత్నం కారణంగా తలెత్తిన ఆర్థిక సమస్యలు చెక్ బౌన్స్ కేసులకు దారితీశాయి. దీనికి సంబంధించి పలు వేర్వేరు చెక్ బౌన్స్ కేసుల్లో దిల్లీ హైకోర్టు రాజ్‌పాల్ యాదవ్‌ను దోషిగా తేల్చింది. ప్రతి కేసుకు సంబంధించి ఫిర్యాదుదారునికి భారీ మొత్తంలో నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

## ధర్మస్థల నియోజకవర్గం




సుమన్, సాయికుమార్, నటరాజ్, వరుణ్‌సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞానప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తున్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్‌ని నిర్వహించారు. నటీనటులంతా ఈ సినిమాలో భాగమైనందుకు ఆనందం వెలిబుచ్చారు. అన్ని వర్గాలకూ నచ్చే ఓ మంచి కథతో థియేటర్లలోకి రాబోతున్నామని దర్శకుడు జై జ్ఞానప్రభ తోట నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా నిర్మాత మేరుం భాస్కర్, పీవీఆర్ సినిమాస్ ప్రతినిధి ఉదయ్ కూడా మాట్లాడారు. ఈ చిత్రానికి మాటలు: అస్లాం, కెమెరా: వెంకట హనుమ, సంగీతం: మహావీర్ ఎల్లంధర్.




## హైప్ పెంచేస్తున్న సుహాస్, సూరి 'మండాడి' పోస్టర్లు

టాలీవుడ్ యాక్టర్ సుహాస్ వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోన్న తమిళ చిత్రం మండాడి (ఘీఅఝుఎఱ). సుహాస్ కోలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న ఈ మూవీలో తమిళ నటుడు సూరి మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. సెల్ఫీ ఫేం మతిమారన్ పుగళేంది డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ సెప్టెంబర్ 10న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఏదో ఒక అప్‌డేట్ అందిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన రషెస్ నెట్టింట హల్ చల్ చేస్తుండగా సుహాస్ బర్త్ డే స్పెషల్ ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. మరోవైపు సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి క్లీన్ యూ/ఏ 16౦ సర్టిఫికెట్ జారీ చేసినట్టు తెలియజేస్తూ సూరి బోటు రైడ్ చేస్తూ అగ్రెసివ్‌గా ఉన్న లుక్‌ను షేర్ చేశారు. ఈ లుక్ మండాడిపై హైప్ పెంచేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మండాడి థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టాలీవుడ్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ దక్కించుకుంది. దీంతో మండాడి సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోతున్నాయి. తీర ప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ మూవీలో సుహాస్ సాట్టపులి రోల్‌లో కనిపించబోతున్నాడు. మహిమా నంబియార్ కీలక పాత్రలో నటిస్తుండగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, అచ్యుత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ తెరకెక్కిస్తోంది.




## శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా.. అసలు కారణం ఇదే!

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ (ఎఖీశ) పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. 1960ల నాటి ఉత్తర తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ బలమైన కథ సాగనుండగా, ఇందులో శర్వానంద్ 'గంగా' అనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఆయన సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా క్లైమాక్స్ కోసం చిత్రబృందం ఏకంగా 30 రోజుల పాటు సాగిన భారీ యాక్షన్ షెడ్యూల్‌ను ఇటీవల విజయవంతంగా పూర్తి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం విడుదల కానుంది.



Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,